శనివారం
07-09-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 73, సంచిక : 78
పేజీలు : 6+8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా నిరసన... గ్రెటా థన్‌బర్గ్ అరెస్ట్

కోపెన్‌హాగెన్ : గాజాపై ఇజ్రాయిల్ దాడిని నిరసిస్తూ డెన్మార్క్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న పర్యావరణవేత్త గ్రెటా థన్‌బర్గ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. స్టూడెంట్స్ అగైనెస్ట్ ది ఆక్యుపేషన్ అనే విద్యార్థి సంఘం అధ్వర్యంలో యూనివర్సిటీ అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయాలను దిగ్బం ధించారు. పాలస్తీనాపై దాడులు కొనసాగుతున్న సమయంలో కోపెన్‌హాగెన్ విశ్వవిద్యాలయం ఇజ్రాయిల్ విశ్వవిద్యాలయాలతో సహకరించడం నిలిపివే యాలని, ఇజ్రాయిల్ యూనివర్సిటీలను బహిష్కరించాలని విద్యార్థులు, నిరసనకారులు డిమాండ్ చేస్తున్నారు. గ్రెటా అరెస్టుపై పోలీసులు స్పందించలేదు.

విజయవాడ ముంపు నివారణకు
శాశ్వత పరిష్కారం

- కేంద్ర సాయంపై సమాచారం లేదు
- విపత్తుకు 28 మంది మృతి
- బుడమేరు గండ్లు పూడ్చడమే ప్రధాన లక్ష్యం
- ముంపు ప్రాంతాల్లో ఉచిత బస్సు సర్వీసులు
- వరద ప్రాంతాల్లో సీఎం చంద్రబాబు ఏరియల్ సర్వే



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: తెలుగురాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వ తక్షణ సహాయంపై తనకు ఎటువంటి సమాచారం లేదని సీఎం చంద్రబాబు తెలిపారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు కేంద్రం ప్రాథమిక సహాయంగా రూ.3,300 కోట్లు కేటాయించినట్లుగా సోషల్ మీడియాలో వార్తలు రావడం, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ట్వీట్ చేసిన అంశాన్ని మీడియా చంద్రబాబు దృష్టికి తీసుకురాగా... తనకు సమాచారం రాలేదని తెలిపారు. కేంద్రానికి ఇంకా ప్రాథమిక నివేదికలే పంపలేదు. వరద నష్టం అంచనాపై శనివారం ఉదయం ప్రాథమిక నివేదిక పంపుతాం. బాధితులకు సాయంపై కేంద్రంతో మాట్లాడుతున్నాం. ఏరియల్ సర్వే ద్వారా ముంపు ప్రాంతాలన్నీ పరిశీలించా. ప్రస్తుతం పై నుంచి ప్రవాహం రావడం లేదు. ముంపు ప్రాంతాల్లో క్రమంగా నీరు తగ్గుతోంది. ముందు బుడమేరు గండ్లు పూడ్చాలన్నదే మా లక్ష్యం. బుడమేరు మూడో గండి పూడ్చేందుకు సైన్యం వచ్చింది. మూడో గండిని ఇవాళ రాత్రికి పూడ్చాలని సర్వశక్తులు ఒడ్డుతున్నామని చంద్రబాబు చెప్పారు. ఏరియల్ సర్వే అనంతరం శుక్రవారం సాయంత్రం విజయవాడ కలెక్టరేట్ వద్ద చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. వరదల వల్ల రాష్ట్రంలో 28 మంది చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్లలో సామగ్రి నష్టానికి ఏం చేయాలనే దానిపై ఆలోచిస్తున్నాం. సహాయ చర్యలు యుద్ధప్రాతిపదికన చేపట్టాం. 149 అర్బన్, 30 రూరల్ సచివాలయాల నుంచి పనులు చేపట్టాం. 3.12 లక్షల ఆహార పొట్లాలు, 11.5 లక్షల వాటర్ బాటిళ్లు, పాలు, బిస్కెట్లు, కొవ్వొత్తులు పంపిణీ చేశాం. నీరు నిల్వ ఉన్న చోట తప్ప మిగతా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరించాం. గ్రామీణ ప్రాంతాల్లో మొత్తం విద్యుత్ కనెక్షన్లు ఇచ్చాం. వరద ప్రాంతాల్లో 72 శాతం పారిశుద్ధ్య పనులు పూర్తి చేశాం. 7,100 మంది పారిశుద్ధ్య సిబ్బంది క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారు. 1,300 పీడీఎస్ వాహనాలు తిరుగుతున్నాయి. ప్రతి కుటుంబానికి నిత్యావసరాల కిట్ ఇస్తున్నాం. మూడ్రోజుల్లో అందరికీ అందుతాయని సీఎం వివరించారు. ఏరియల్ సర్వే నిర్వహించి కొల్లేరు వరకూ వెళ్లి తర్వాత బుడమేరును అధ్యయనం చేశామని, కృష్ణానదికి వస్తున్న వరదపై క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు వివరించారు. ముందు బుడమేరు బ్రీచ్ క్లీన్ చేయాలని, అప్పుడే తాము చేసే పనికి సార్థకత అవుతుందని తెలిపారు. మూడు బ్రీచ్‌లలో రెండు మూసుకుపోయాయని చెప్పారు. ఇంకా ఒక్కటి ఉందని చెప్పారు. నిన్న 9 వేల క్యూసెక్కుల నీరు వచ్చిందని, ఇప్పుడు తగ్గి 3000 క్యూసెక్కుల నీరు

- మిగతా 2 లో

శ్రీశైలానికి పోటెత్తిన వరద

విశాలాంధ్ర-శ్రీశైలం : ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు కృష్ణా నదికి మళ్లీ వరద పోటెత్తింది. దీంతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. శ్రీశైలం జలాశయానికి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు 6 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. నాగార్జున సాగర్ వైపు కృష్ణమ్మ ఉధృతంగా ప్రవహిస్తోంది. శ్రీశైలం స్పిల్ వే ద్వారా 1.67 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువ నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు 1.64 లక్షల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం గరిష్ఠ నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 884.4

- మిగతా 2 లో

భద్రాచలం వద్ద తగ్గిన గోదావరి నీటిమట్టం

విశాలాంధ్ర-భద్రాచలం : ఎగువ నుంచి వరద తగ్గడంతో భద్రాచలం వద్ద గోదావరి నది నీటిమట్టం తగ్గింది. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు 42.2 అడుగుల వద్ద వరద ప్రవహిస్తుండ దంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహ రించుకున్నారు. శుక్రవారం రాత్రికి మరింతగా వరద తగ్గే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. అలాగే తాలిపేరుకు ఎగువ నుంచి వరద వస్తుండడంతో అధికారులు 24 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. 17,704 క్యూసెక్కుల వరద నీటిని దిగువనున్న గోదావరిలోకి వదిలారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 74 మీటర్లు కాగా... ప్రస్తుతం 69.90 మీటర్ల మేర నీరు ఉండేలా అధికారులు చర్యలు చేపట్టారు.

వరదపై కేంద్ర ప్రత్యేక బృందం

న్యూఢిల్లీ: తెలుగురాష్ట్రాల్లో వరద నష్టం అంచనా వేసేందుకు వివిధ మంత్రిత్వశాఖల నిపుణులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు కేంద్ర హోంశాఖ వెల్లడించింది. ప్రధాని మోదీ ఆదేశాల మేరకు ఏపీ, తెలంగాణకు పూర్తి సహకారం అందిస్తామని పేర్కొంది. వరద ప్రాంతాలకు ఇప్పటికే నిపుణుల బృందం పంపినట్లు తెలిపింది. వరదలు, డ్యామ్‌లు, వాటి భద్రతను కేంద్ర బృందం పరిశీలిస్తుందని వెల్లడించింది.



భారత్‌కు మరో స్వర్ణం

- హైజంప్‌లో మెరిసిన ప్రవీణ్
- పారాలింపిక్స్‌లో 26కు చేరిన పతకాలు

పారిస్: పారాలింపిక్స్-2024లో భారత అథ్లెట్లు వైకల్యాలను అధిగమించి మరీ పతకాలను సాధిస్తున్నారు. ఈ క్రమంలోనే తాజాగా భారత్ ఖాతాలో మరో పతకం వచ్చి చేరింది. పురుషుల హై జంప్ టీ64 ఈవెంట్‌లో ప్రవీణ్ కుమార్ అగ్ర స్థానంలో నిలిచి స్వర్ణ పతకం దక్కించుకున్నాడు. టీ 64 హై జంప్ పోటీల్లో 2.08 మీటర్ల ఎత్తు జంప్ చేసి స్వర్ణాన్ని ముద్దాడాడు. ఈ సీజన్‌లో ఇదే అత్యుత్తమ హై జంప్ రికార్డ్. ఈ పతకంతో భారత్ ఖాతాలో పతకాల సంఖ్య 26కు చేరింది. ఇందులో 6 స్వర్ణాలు, 9 రజతాలు, 11 కాంస్య పతకాలు ఉన్నాయి. 2021లో జరిగిన టోక్యో పారాలింపిక్స్‌లోనూ ప్రవీణ్ రజత పతకం సాధించాడు. తద్వారా అప్పుడు అతడు అతి చిన్న వయసులోనే ఒలింపిక్ పతకం సాధించిన పారా అథ్లెట్‌గా చరిత్రకెక్కాడు. ఇంకా ప్రస్తుత పారాలింపిక్స్‌లోస్వర్ణ పతకం అందుకోవడంతో ప్రవీణ్ పారాలింపిక్స్‌లో వరుసగా రెండో పతకాన్ని సాధించినట్లయింది. అలానే హైజంప్‌లో భారత్ తరఫున బంగారు పతకం సాధించిన రెండో ఆటగాడు కూడా ప్రవీణే. అంతకుముందు మరియప్పన్ తంగవేలు ఈ హైజంప్‌లో స్వర్ణాన్ని ముద్దాడాడు. ఇంకా పారిస్

- మిగతా 2 లో

కేంద్రం ఆదుకోవాలి

తక్షణమే జాతీయ విపత్తుగా ప్రకటించాలి

- కేరళ అండగా ఉంటుందని ఎంపీ సంతోష్ కుమార్ హామీ
- మోదీ ముంపు ప్రాంతాలు పరిశీలించాలి: రామకృష్ణ
- వరద బాధితులకు ధైర్యం చెప్పిన సీపీఐ నేతలు
- చంద్రబాబును కలిసి సహాయ చర్యల వేగవంతానికి వినతి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: కృష్ణానది, బుడమేరు వరద కనీవినీ ఎరుగని రీతిలో ప్రజలకు అపార నష్టాన్ని చేకూర్చినందున, దీనిని కేంద్ర ప్రభుత్వం తక్షణమే జాతీయ విపత్తుగా ప్రకటించి బాధితులను ఆదుకోవాలని సీపీఐ పార్లమెంటు సభ్యులు సంతోశ్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాలు, విజయవాడ నగరంలోని ముంపు ప్రాంతాల్లో శుక్రవారం సీపీఐ బృందం విస్తృతంగా పర్యటించి... బాధితులను ఓదార్చింది. నీట మునిగిన పంట పొలాలను పరిశీలించింది. సహాయ చర్యలు ఏ విధంగా అందుతున్నాయి? బాధితులకు ఈ విపత్తు వల్ల జరిగిన నష్టంపై ఆరా తీసింది. ఇటువంటి సమయాల్లో ధైర్యంగా ఉండాలని, తామంతా అండగా ఉంటామని బాధితులకు ధైర్యం చెప్పింది. సహాయ చర్యలు ముమ్మరంగా చేపట్టేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెస్తామని భరోసా ఇచ్చింది. గత ఐదు రోజులుగా విజయవాడ నగర ప్రజల ఇళ్లన్నీ వరద ముంపులో మునిగిపోయి... కట్టుబట్టలతో బాధలు పడుతుండటం బాధేస్తోందని ఆవేదన వ్యక్తం చేసింది. కేరళ అండగా ఉంటుందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎంపీ సంతోశ్ కుమార్ అభయమిచ్చారు. ముంపు పరిస్థితుల్లో ఐదు రోజులైనా మార్పు రాకపోవడం ఆశ్చర్యం కలిగిస్తున్నదన్నారు. ప్రజలు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని, రాజకీయాలకు ఇది సమయం కాదని, ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వానికి అన్ని రాజకీయపక్షాలు విలువైన సూచనలిస్తూ, బాధితులకు అండగా నిలబడాలని కోరారు. ఇలాంటి విపత్తు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. ముంపు ప్రజలకు మనోధైర్యమిచ్చేలా కృషి చేస్తున్న అధికారులు అభినందనీయులని కొనియాడారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ ఐదు రోజులుగా వరద ముంపు మండలాలు, ప్రాంతాలు పర్యటించామని, ఆహారం, మంచినీటి కోసం చిన్న సందుల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సహాయచర్యలు ప్రతి ఇంటికీ చేరాలని

- మిగతా 2 లో

సీఎం చంద్రబాబుతో భేటీ

కలెక్టరేట్‌లో సీఎం చంద్రబాబుతో రామకృష్ణ, సంతోశ్‌కుమార్ భేటీ అయ్యారు. ముంపు ప్రాంతాల్లో జరుగుతున్న సహాయ కార్యక్రమాలు, యుద్ధప్రాతిపదికన జరుగుతున్న బుడమేరు గండ్లు పూడ్చివేత పనుల పట్ల అభినందనలు తెలిపారు. సహాయ కార్యక్రమాల అమల్లో జరుగుతున్న లోటుపాట్లను సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. భవిష్యత్తులో ఇటువంటి విపత్తులు పునరావృతం కాకుండా శాశ్వత చర్యలపై తక్షణమే దృష్టి పెట్టాలని కోరారు.

ఈ పర్యటనలో సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యులు అక్కినేని వనజ, రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు జి.ఓబులేసు, జి.ఈశ్వరయ్య, కేవీవీ ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్, సీపీఐ ఎన్టీఆర్, కృష్ణా జిల్లా, విజయవాడ, గుంటూరు నగర కార్యదర్శులు దోనేపూడి శంకర్, మాల్యాద్రి, టి.తాతయ్య, జి.కోటేశ్వరరావు, విశాలాంధ్ర డీజీఎం టి.మనోహర్ నాయుడు, కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.జమలయ్య, ఇస్కఫ్ రాష్ట్ర నాయకులు సుబ్బారావు, డీహెచ్‌పీఎస్ నాయకులు బుట్టి రాయప్ప, విద్యార్థి, యువజన సమాఖ్య రాష్ట్ర నేతలు జాన్సన్ బాబు, పరుచూరి రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సామూహిక అత్యాచారం కాదు

కోల్‌కతా వైద్యురాలి కేసుపై సీబీఐ

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో జూనియర్ వైద్యురాలిపై సామూహిక అత్యాచారం జరగలేదని సీబీఐ గుర్తించినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. నిందితుడు సంజయ్‌రాయ్ ఒక్కడే ఈ దారుణానికి ఒడిగట్టాడని నిర్ధారించినట్లు పేర్కొన్నాయి. దర్యాప్తు తుదిదశకు చేరుకుందని, త్వరలో కోర్టులో అభియోగాలు దాఖలు చేయనుందని తెలిపాయి. తొలుత ఈ కేసును బెంగాల్ పోలీసులు దర్యాప్తు చేశారు. అయితే ఆ విచారణపై అనుమానాలు వ్యక్తం కావడంతో కోల్‌కతా హైకోర్టు ఆ కేసును సీబీఐకి బదిలీ చేసింది. కాగా, ఆర్జీ కర్ ఆసుపత్రిలోని సెమినార్ రూమ్‌లో ఆగస్టు 9న పీజీ వైద్య విద్యార్థి విగత జీవిగా కనిపించి ఉండటాన్ని గుర్తించారు. తొలుత ఆత్మహత్య చేసుకుందని అధికారులు చెప్పినప్పటికీ... హత్యాచారమని దర్యాప్తులో తేలింది. వలంటీర్‌గా పనిచేస్తున్న సంజయ్‌రాయ్‌ను ఈ కేసులో పోలీసులు ఘటన జరిగిన మరుసటి రోజే అరెస్టు చేశారు. అతడి మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకొని పరిశీలించగా... అశ్లీల

- మిగతా 2 లో

ఇదీ లోకం!

విరాళమొక్కటే ప్రకటించి ఊరుకోవడానికి మీరు సినిమా హీరో మాత్రమే కాదు కదసార్! మీరు కూడా మోకాళ్లలోతు బురదలో దిగాలి!

ఇంకా జలదిగ్బంధమే...

- రంగంలోకి సైన్యం
- బుడమేరు గండి పూడ్చివేతకు విశ్వ ప్రయత్నం
- ఆగని వరద ఉధృతి... బెజవాడ కాలనీల్లో పెరుగుతున్న నీటిమట్టం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆరు రోజులు గడుస్తున్నా బెజవాడ ఇంకా జల దిగ్బంధంలోనే ఉంది. బుడమేరు గండ్ల పూడ్చివేత ద్వారా నగరాన్ని వరద ముంపునుంచి బయటపడేయాలని ప్రభుత్వం విశ్వప్రయత్నం చేస్తోంది. ఈ

- మిగతా 2 లో

హారిస్‌కు విరాళాల వెల్లువ

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమోక్రట్, రిపబ్లికన్ అభ్యర్థుల మధ్య తీవ్ర పోటీ కొనసాగుతోంది. ప్రచారంలో దూసుకెళ్తున్న ఉపాధ్యక్షురాలు కమలా హారిస్... మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు గట్టి పోటీ ఇస్తున్నారు. ఈ క్రమంలో ఆమెకు భారీస్థాయిలో మద్దతు వస్తున్నట్లు తెలుస్తోంది. ఆగస్టులో ట్రంప్‌నకు వచ్చిన విరాళాల కంటే హారిస్ రెట్టింపు విరాళాలు సేకరించారు. డెమోక్రట్ తరఫున అభ్యర్థిత్వం ఖరారైన తర్వాత కమలా హారిస్ పూర్తిస్థాయి ప్రచారం మొదలుపెట్టారు. ఇందులో భాగంగా ఆగస్టులో 30 లక్షల మంది దాతల నుంచి 36.1 కోట్ల డాలర్ల విరాళాలు సేకరించారు. సెప్టెంబర్‌లో న్యూయార్క్, అట్లాంటా, లాస్ ఏంజిల్స్, శాన్ ఫ్రాన్సిస్కోలో అనేక కార్యక్రమాలు నిర్వహించేందుకు హారిస్ బృందం ఏర్పాట్లు చేస్తోంది. ట్రంప్ మాత్రం ఆగస్టులో 13 కోట్ల డాలర్లు మాత్రమే సేకరించినట్లు ఆయన బృందం వెల్లడించింది. నవంబర్‌లో జరగనున్న అధ్యక్ష ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా డెమోక్రటిక్, రిపబ్లికన్ పార్టీలు ముమ్మర ప్రచారం చేస్తున్నాయి. ఇందుకోసం మొత్తంగా ఒక బిలియన్ డాలర్లు ఖర్చు చేయనున్నట్లు అంచనా. ప్రకటనలు, ఆయా రాష్ట్రాల్లో ప్రచారానికయ్యే ఖర్చుల కోసం నిధులు సేకరిస్తున్నాయి.

తప్పుదారి పట్టించే ఆరోపణలు

ఫ్రెంచ్ ప్రభుత్వంపై టెలిగ్రామ్ సీఈఓ మండిపాటు

పారిస్: టెలిగ్రామ్ సీఈఓ పావెల్ దురోవ్ ఫ్రెంచ్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఫ్రెంచ్ అధికారులు తప్పుదారిపట్టించే నేరారోపణలతో తనను అరెస్ట్ చేశారని విమర్శించారు. ఆరోపణలపై అధికారులు తన కంపెనీని సంప్రదించలేదని అన్నారు. ఇటీవల బెయిల్‌పై విడుదలైన దురోవ్ తన అరెస్ట్‌పై మొదటిసారి బహిరంగంగా స్పందించారు. సోషల్‌మీడియా/ మెసేజింగ్ ప్లాట్‌ఫారంలో ఇతరులు చేపట్టిన చట్టవ్యతిరేక కార్యకలాపాలకు తాను వ్యక్తిగతంగా బాధ్యత వహించాలని తెలుసుకుని దిగ్భ్రాంతికి గురయ్యానని టెలిగ్రామ్‌లో పోస్ట్ చేశారు. ఒక దేశం ఇంటర్నెట్ సేవ పట్ల అసంతృప్తిగా ఉంటే, ఆ సేవపైన చట్టపరమైన చర్యలు తీసుకోవడం స్థిరమైన పద్ధతి అని అన్నారు. సోషల్‌మీడియా ప్లాట్‌ఫారంలో మూడవ పార్టీ చేసిన నేరాలకు ఆ కంపెనీ సీఈఓపై అభియోగాలు మోపేందుకు స్మార్ట్‌ఫోన్ పూర్వకాలం నాటి చట్టాలను వినియోగించడం ముమ్మాటికీ తప్పుదారి పట్టించే విధానమేనని మండిపడ్డారు. తనను లక్ష్యంగా చేసుకునేందుకు ఫ్రాన్స్ అధికారులు అనేక మార్గాలు ఎంచుకున్నారని అన్నారు. ఈ కేసును ఫ్రాన్స్ విచారించడం వలన నూతన సాంకేతిక ఆవిష్కరణలకు అడ్డుకట్టపడే ప్రమాదం ఉందన్నారు. సాంకేతికతను అభివృద్ధి చేయడం, ఆవిష్కరించడం చాలా కష్టమని ఆయన పేర్కొన్నారు.

'టెలిగ్రామ్ ఓ అరాచక స్వర్గం' అన్న వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. తాము ప్రతి రోజూ మిలియన్ల కొద్దీ హానికరమైన పోస్ట్‌లను మీడియా నుండి తొలగిస్తామని, అయినప్పటికీ టెలిగ్రామ్ చర్యలు పరిమితమని వాదించేవారున్నారని చెప్పారు. టెలిగ్రామ్ వినియోగదారుల సంఖ్య పెరుగుతూ ఒక్కసారిగా 950 మిలియన్లకు చేరుకుందని, దీంతో నేరస్థులకు ఈ ప్లాట్‌ఫారంను దుర్వినియోగం చేయడం సులభతరమైందని అన్నారు. దురోవ్ అరెస్ట్‌పై రష్యా కూడా ఆందోళన వ్యక్తం చేసింది. ఆరోపణలను రుజువుచేసేందుకు బలమైన సాక్ష్యం అందించాలని ఫ్రెంచ్ అధికారులను సవాలు చేసింది.

జెలెన్‌స్కీని అధ్యక్షుడిగా గుర్తించం: రష్యా

మాస్కో: ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని చట్టబద్ధంగా ఎన్నుకొన్న వ్యక్తిగా భావించడం లేదని రష్యా చెప్పుకొచ్చింది. 2014 తిరుగుబాటు తర్వాత ఆ దేశంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడలేదని క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ వెల్లడించారు. జెలెన్‌స్కీని తాము ఉక్రెయిన్ దేశాధ్యక్షుడిగా గుర్తించడం లేదని తెలిపారు. వాస్తవానికి జెలెన్‌స్కీ అధ్యక్షకాలం ఈ ఏడాది మే 20వ తేదీతో ముగిసింది. కానీ, యుద్ధం కొనసాగుతుండటంతో ఎన్నికలు నిర్వహించకూడదని ఆయన నిర్ణయించారు. ఈ పరిణామాలపై ఈస్టర్న్ ఎకనామిక్ ఫోరమ్‌లో పెస్కోవ్ మాట్లాడుతూ 2014లో ఉక్రెయిన్‌లో కుట్రతో చట్టబద్ధ ప్రభుత్వాన్ని కూల్చారు. ఇప్పుడు ప్రజాప్రభుత్వం కనుమరుగు కావడంతో ఆ దేశం తీవ్ర ఇబ్బందులు పడుతోందన్నారు. ఉక్రెయిన్‌తో వివాదాలను రాజకీయ, దౌత్య మార్గాల్లో పరిష్కరించుకోవడానికి రష్యా సిద్ధంగా ఉందని తెలిపారు. కానీ, ఆ దేశ నాయకత్వం, పశ్చిమదేశాలు మాత్రం చర్చలకు సిద్ధంగా లేవని విమర్శించారు. గతంలో రష్యా అధినేత పుతిన్ కూడా ఉక్రెయిన్ నాయకత్వ చట్టబద్ధతను ప్రశ్నించారు. జూన్‌లో సెయింట్ పీటర్స్‌బర్గ్ ఇంటర్నేషనల్ ఎకనామిక్ ఫోరంలో ఆయన మాట్లాడుతూ 'మేం కీవ్‌పై యుద్ధం మొదలుపెట్టామని ఎవరన్నారు. అది పూర్తిగా తప్పు. ఉక్రెయిన్‌లో తిరుగుబాటుతో మొదలైంది. అది పూర్తిగా చట్ట విరుద్ధమైంది' అని వ్యాఖ్యానించారు. జెలెన్‌స్కీ కాలవ్యవధి ముగియడంతో అధికారం పార్లమెంట్‌కు అప్పగించి అతడు వైదొలగాలని నాడు పుతిన్ సూచించారు. భవిష్యత్తులో జరిగే అప్రజాస్వామిక నిర్ణయాలకు బలిపశువును చేయడానికి వీలుగా జెలెన్‌స్కీని పశ్చిమ దేశాలు అధికారంలో ఉంచాయన్నారు. తాజాగా రష్యా శాంతి చర్చల ప్రస్తావనను తరచూ తీసుకొస్తోంది. కీవ్‌తో చర్చలకు సిద్ధంగా ఉన్నామని నిన్న పుతిన్ స్వయంగా వెల్లడించారు. భారత్, చైనా, బ్రెజిల్ దేశాలు మాస్కో-కీవ్ మధ్య శాంతి చర్చలకు మధ్యవర్తిత్వం వహించగలవని ఆయన సూచించారు.

భారత్‌కు మరో స్వర్ణం

(మొదటిపేజీ తరువాయి)

పారాలింపిక్స్‌లో స్వర్ణ పతకం సాధించిన మూడో హైజంపర్‌గానూ నిలిచాడు. ఇకపోతే ఈ పారిస్ పారాలింపిక్స్‌లో ఇప్పటికే హైజంప్ టీ-63 ఈవెంట్‌లో శరద్ కుమార్ రజత పతకం (1.88 మీటర్లు), తంగవేలు మరియప్పన్ కాంస్య (1.85 మీటర్లు) పతకం దక్కించుకున్నారు.

ఎవరీ ప్రవీణ్ కుమార్

ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాకు చెందిన 21ఏళ్ల అథ్లెట్ ప్రవీణ్ కుమార్‌కు పుట్టుకతోనే కాలి వైకల్యం ఉంది. ఓ కాలు చిన్నగా ఉండటం వల్ల చిన్నప్పుడు ఆత్మన్యూనతా భావంతో గడిపేవాడు. అయితే ఆ బాధను అధిగమించడానికి క్రీడల వైపు ఆసక్తి చూపాడు. మొదట వాలీబాల్ ఎక్కువగా ఆడేవాడు. కానీ ఆ తర్వాత ఓ పారా అథ్లెటిక్స్ కోచ్ అతడి సామర్థ్యాన్ని గుర్తించి హైజంప్‌లో పోటీ పడేలా ప్రోత్సహించాడు. అప్పటి నుంచి ప్రవీణ్ కెరీర్ మలుపు తిరిగింది. 2019లో స్విట్జర్లాండ్ వేదికగా జరిగిన ప్రపంచ పారా అథ్లెటిక్స్ జూనియర్ ఛాంపియన్‌షిప్‌లో ప్రవీణ్ రజత పతకం సాధించాడు. ఆ తర్వాత 2021లో దుబాయ్ వేదికగా జరిగిన గ్రాండ్ ప్రీ అథ్లెటిక్స్ ఈవెంట్‌లోనూ బంగారు పతకం అందుకున్నాడు. అదే ఏడాది టోక్యో పారాలింపిక్స్‌లోనూ రజతం దక్కించుకున్నాడు. 2022లో ఏషియన్ పారా గేమ్స్‌లోనూ బంగారు పతకం సాధించడంతో పాటు 2.05 మీటర్లతో ఆసియా రికార్డు సృష్టించాడు.

సామూహిక అత్యాచారం కాదు

(మొదటిపేజీ తరువాయి)

వీడియోలు ఉన్నట్లు గుర్తించారు. సంజయ్ రాయ్‌ను సీబీఐ విచారించిన సందర్భంగా అతడి ప్రవర్తన గురించి అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి. "సంజయ్ రాయ్‌లో పశ్చాత్తాపం లేదు. ప్రతి నిమిషం చోటుచేసుకున్న విషయాలను గుక్కతిప్పకుండా మొత్తం ఎపిసోడ్‌ను వివరించాడు. దాన్నిబట్టి చూస్తే అతనికి ఎటువంటి పశ్చాత్తాపం లేనట్లు కనిపించింది. నేరం జరిగిన ప్రదేశంలో నిందితుడు ఉన్నాడని చెప్పడానికి సాంకేతిక, శాస్త్రీయ ఆధారాలున్నాయి. ఆగస్టు 8 ఉదయం 11 గంటలకు శ్వాసకోశ విభాగం సమీపంలో రాయ్ కనిపించాడు. ఆగస్టు 9 తెల్లవారుజామున 4 గంటలకు మళ్లీ అదే బిల్డింగులోకి వెళ్లినట్లు సీసీటీవీలో రికార్డయింది" అని కేసు దర్యాప్తులో పాల్గొన్న ఓ సీబీఐ అధికారి గతంలో వెల్లడించారు.

శ్రీశైలానికి పోటెత్తిన వరద

(మొదటిపేజీ తరువాయి)

అడుగులుగా ఉంది. శ్రీశైలం గరిష్ఠ నీటినిల్వ 215.8 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 212.9 టీఎంసీలుగా ఉంది. శ్రీశైలం ప్రాజెక్టు కుడి, ఎడమ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి ముమ్మరంగా కొనసాగుతోంది. విద్యుత్ ఉత్పత్తి చేసి 67,631 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ఈ క్రమంలో సాగర్ పరీవాహక ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.

కేంద్రం ఆదుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

కోరారు. వంద సంవత్సరాల చరిత్రలో ఎన్నడూలేని విధంగా వచ్చిన ఈ ఉపద్రవాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే జాతీయ విపత్తుగా ప్రకటించి బాధితులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ తక్షణమే ముంపు ప్రాంతాల్లో పర్యటించాలని, బాధితుల ఇబ్బందులు ప్రత్యక్షంగా చూసి తెలుసుకోవాలని కోరారు. ఓ పక్క బాధితులు ఐదు రోజులుగా వరద ముంపులోనే ఇబ్బందులు పడుతుండగా, మరోవైపు వరద నీరు కలుషితమై అనారోగ్యాలు ప్రబలే ప్రమాదం నెలకొందన్నారు. అకస్మాత్తుగా వచ్చిన భారీ వరదతో కట్టుబట్టలతో పూర్తిగా నిరాశ్రయులైన బాధితులకు సహాయక చర్యలు మరింత వేగవంతం చేయాలని కోరారు. వరద ఉధృతికి పంట భూములు కూడా పూర్తిగా మునిగిపోయి... రైతులకు అపారనష్టం కలిగిందని, ఒక్క కృష్ణాజిల్లాలోనే లక్షా ఐదు వేల ఎకరాల పంట భూములు ముంపునకు గురయ్యాయని రామకృష్ణ తెలిపారు. ఇప్పటికే వేల కోట్ల పెట్టుబడులు నీటిపాలయ్యాయని, చిన్న వ్యాపారస్తులకు కోలుకోలేని నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో ప్రజల బాధలను పరిష్కరించేందుకు రాజకీయాలకతీతంగా అన్ని పార్టీలు బాధితులకు అండగా నిలబడేందుకు కలిసి రావాలని కోరారు.

ఇంకా జలదిగ్బంధమే...

(మొదటిపేజీ తరువాయి)

క్రమంలో గండ్ల పూడ్చివేత కోసం సైన్యాన్ని రంగంలోకి దింపింది. ప్రస్తుతం ముంపుకు కీలకంగా భావిస్తున్న బుడమేరు మూడో గండిని పూడ్చే పనుల్లో సైనిక దళం నిమగ్నమైంది. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం శాంతినగర్ సమీపాన గండి పడిన ప్రాంతానికి 6వ మద్రాస్ సైనిక దళం నుంచి 120 మంది సైనిక అధికారులు, జవాన్లు గండి పడిన ప్రాంతానికి తరలివచ్చారు. జోరు వానలోను బుడమేరు గట్టు నిర్మాణం పనుల్లో స్థానిక అధికారులతో కలిసి సైనికులు నిమగ్నమయ్యారు. ఎలాగైనా మూడో గండి వేగవంతంగా పూడ్చాలన్న లక్ష్యంతో అధికార యంత్రాంగం ఉంది. వీలైతే శుక్రవారం రాత్రికే పూర్తి చేసేందుకు శ్రమిస్తున్నారు. వాతావరణం అనుకూలించకుంటే శనివారంతో పనులు పూర్తవుతాయి. ఇప్పటికే రెండు గండ్లను అధికారులు పూడ్చివేయించగా...మిగిలిన మూడో దానికి యుద్ధప్రాతిపదికన పూడ్చివేత పనులు నిర్వహిస్తున్నారు. గండి పడిన ప్రాంతంలో వర్షం పడుతున్నప్పటికీ పనులు కొనసాగుతున్నాయి. ఒక వైపు గండి పూడుస్తూనే..మరోవైపు నీటి ప్రవాహాన్ని కట్టడి చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. మచిలీపట్నం నుంచి వచ్చిన పడవలను బుడమేరు గండి పడిన ప్రాంతానికి తరలించి సహాయక చర్యలు నిర్వహిస్తున్నారు. వర్షాలు, భారీ వరదలతో ఎన్టీఆర్‌జిల్లా శాంతినగర్ దగ్గర బుడమేరు గట్లకు మూడు గండ్లు పడ్డాయి. ఈ గండ్ల ద్వారా 40వేల క్యూసెక్కుల నీరు తరలిచ్చి విజయవాడ నగర పరిసర ప్రాంతాలను ముంచెత్తింది. ఐదు రోజులపాటు వరద ముంపులోనే ప్రజలు ఉండేలా చేసింది. ప్రజలను నిరాశ్రయిలను చేసింది. ఆహారం, మంచినీరు, ప్రాథమిక సౌకర్యాలు తీర్చుకునే అవకాశం లేకుండా బుడమేరు వరద విలయతాండం చేసింది. శాంతినగర్ నుంచి బుడమేరు కవులూరు, పైలూరిపాడు, ఈలప్రోలు, రాయనపాడు చెరువు మీదుగా ప్రవహించి సింగ్‌నగర్‌కు చేరుకుంటుంది. అక్కడి నుంచి నందివాడ మండలం మీదుగా కొల్లేరులో కలుస్తుంది. భారీ వర్షాలతో బుడమేరుకు మూడు గండ్లు పడగా...ఇందులో ఒకదానికి 100 మీటర్లు, మిగిలిన వాటికి 60 మీటర్లు, 50 మీటర్ల పొడవుతో గండ్లు పడ్డాయి. వర్షాలు పడటంతో బుడమేరు గండ్ల పూడికకు ఆటంకం ఏర్పడింది. సీఎం చంద్రబాబు ఈ గండ్ల పూడిక పనులను మంత్రి నారా లోకేశ్, జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటికే రెండు గండ్ల పనులు పూర్తయ్యాయి. ఇక మిగిలిన 100 మీటర్ల మేర పొడవున్న గండి పూడ్చివేతకు సైన్యాన్ని రప్పించారు. బుడమేరు, కొల్లేరు ప్రాంతాలను సీఎం చంద్రబాబు ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అధ్వర్యంలో పార్టీ ఎంపీ సంతోశ్ కుమార్‌తో కూడిన నేతల బృందం వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించింది.

గేబియాన్ బుట్టలతో...

గేబియాన్ బుట్టల విధానంతో బుడమేరు కట్టకు పడిన గండిని పూడ్చివేయాలని సైనికులు నిర్ణయించారు. ఇందుకోసం రాష్ట్ర అధికారుల పర్యవేక్షణలో పనులు నిర్వహిస్తున్నారు. గేబియాన్ బుట్టలు అంటే...ఇనుప చువ్వను బుట్టలా తయారు చేసి, దానిని పెద్ద రాళ్లు, ఇసుక బస్తాలతో నింపుతారు. మొదట గేబియాన్ బుట్టలు పేర్చి... తర్వాత రాళ్లు వేస్తారు. ఈ బుట్టలను పటిష్టం చేసేందుకుగాను నాలుగు మీటర్ల వరకు రక్షిత కట్టను నిర్మిస్తారు. గేబియాన్ బుట్టల తయారీని ఆర్మీ అధికారుల పర్యవేక్షణలో స్థానికంగా తయారు చేస్తున్నారు. జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పనుల వేగవంతానికి కృషి చేస్తున్నారు. మూడో గండి పూడ్చితేనే బుడమేరు నుంచి విజయవాడకు ముంపు ప్రమాదం తప్పుతుందని భావిస్తున్నారు. బుడమేరు గండ్ల పూడికే తమ లక్ష్యమని, ఆ దిశగా యుద్ధప్రాతిపదికన పనులు కొనసాగిస్తున్నట్లు సీఎం చంద్రబాబు స్పష్టంచేశారు.

కాలనీల్లో నడుం లోతు నీరు

మళ్లీ బుడమేరు పొంగడంతో సింగ్‌నగర్‌లోని వివిధ కాలనీలకు వరద పెరుగుతోంది. కండ్రిక, వాంబేకాలనీ, ఆంధ్రప్రభకాలనీల్లో ఇంకా నడుంలోతులో నీరుంది. నీటి మట్టం క్రమేపీ పెరుగుతోంది. బయటకు రావాలంటే స్థానిక ప్రజలు నడుం లోతు నీళ్లలో దిగి రావాలి. రామకృష్ణాపురం, రాజరాజేశ్వరిపేట ప్రాంతాల్లోనూ వరద నీటి ప్రవాహం అధికమవుతోంది. దీనివల్ల రాకపోకలకు స్థానికులు అవస్థలు పడుతున్నారు.

మరోవైపు రాయనపాడు వద్ద బుడమేరు ప్రవాహం పెరిగింది. సమీప రైల్వేస్టేషన్‌లో ట్రాక్‌లపైకి వరదనీరు ప్రవహిస్తోంది. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపడుతున్నారు. కాలనీవాసులకు ప్రభుత్వం సహాయ కార్యక్రమాలను ఉధృతం చేసింది. అయితే వైఎస్ఆర్ కాలనీచుట్టూ నీరు చేరికతో వారు బయటకు వచ్చే అవకాశం లేదు. ఆహారం, మంచినీరు వారి దరిచేరడం లేదు. ఇప్పటివరకు విద్యుత్ పునరుద్ధరణ పనులకు ప్రభుత్వం సిద్ధమవ్వగా, మళ్లీ వర్షం పడటంతో వాటికి అంతరాయం కలిగింది. వరద నీరు చేరడంతో పారిశుధ్య పనులకూ అసౌకర్యం కలుగుతోంది. ఎగువ నుంచి భారీగా వస్తున్న వరద నీటితో కృష్ణాజిల్లా నందివాడ మండలంలోని 12 గ్రామాలు జలదిగ్బంధంలో మునిగిపోయాయి. బుడమేరు వరద కాస్త తగ్గుముఖం పట్టడంతో ఈనెల 5వ తేదీన ప్రజలు తమ నివాసాల్లోకి వెళ్లి బురదను శుభ్రం చేసుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. మళ్లీ కొన్ని ప్రాంతాల్లోకి వరద నీరు ఇంట్లోకి రావడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు.

అన్నదాతలకు కేంద్రం అండ: శివరాజ్ సింగ్ చౌహాన్

విశాలాంధ్ర-ఖమ్మం/కూసుమంచి: పంటలు కోల్పోయిన రైతులకు అండగా ఉంటామని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం పాలేరులో శుక్రవారం ఆయన అన్నదాతలతో మాట్లాడారు. ఖమ్మం మున్నేరు వరదల వల్ల జరిగిన నష్టాన్ని ఆయన... కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇతర మంత్రులతో కలిసి ఆయన హెలికాప్టర్ ద్వారా ఏరియల్ సర్వే చేశారు. తొలుత నాయకన్ గూడెం వద్ద మంత్రులు భట్టి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు వారికి స్వాగతం పలికారు. అనంతరం పాలేరులో అధికారులు ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. రైతులతో ఏర్పాటు చేసిన ముఖాముఖి కార్యక్రమంలో వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శివరాజ్ సింగ్ మాట్లాడుతూ తాను రైతులతో మాట్లాడానని వారు చాలా బాధలో ఉన్నారన్నారు. వరదలతో వరి, మిర్చి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, ఇంట్లో వస్తువులు కూడా కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడి పూర్తిగా నష్టపోయారని వారికి తాము తోడుగా ఉంటామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం విపత్తు నిధులను వాడుకోకుండా పక్కదారి పట్టించిందని ఆయన ఆరోపించారు. ఫసల్ బీమా అమలు చేయలేదని, తాము చేస్తామన్నా ఒప్పుకోలేదని శివరాజ్ విమర్శించారు. కేంద్ర పథకాలు ఏవిధంగా ఉపయోగపడతాయో ఆలోచిస్తున్నామని, రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి సాయం ఎలాచేయాలో నిర్ధారిస్తామన్నారు. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి , కలెక్టర్ ముజామిల్ ఖాన్, అదనపు కలెక్టర్ శ్రీజ, జిల్లా అధికారులు, కూసుమంచి ఏడీఏ సరిత , ఏవో వాణి పాల్గొన్నారు.

విరాళాల వెల్లువ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : వరద బాధితులకు సహాయం అందించేందుకు ముందుకు రావాలని సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన పిలుపుతో దాతల నుంచి స్పందన పెద్ద ఎత్తున లభిస్తోంది. విజయవాడలోని ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో సీఎం చంద్రబాబును రాజకీయ పార్టీల నేతలు, అనేక వ్యాపార సంస్థల అధినేతలు, ఉద్యోగులు, ప్రముఖులు, కార్మిక సంఘాల నాయకులు కలిసి విరాళాలను చెక్కు నగదు రూపంలో అందించారు.

శుక్రవారం విరాళాలు అందించిన వారిలో... కాటూరి సుబ్బారావు రూ.10 కోట్లు, జాస్తి సుధా అండ్ వెంకట్ ఫ్యామిలీ రూ.5 కోట్లు, శ్రీచైతన్య, శ్రీ కళ్యాణ చక్రవర్తి మెమోరియల్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ రూ.2 కోట్లు, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు రూ.1 కోటి, రవికుమార్ రెడ్డి, బపేశ్వరరావు రూ.1 కోటి, సీఎం రాజేష్, సీఎం రిత్విక్ రూ.1 కోటి, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అలిమినేని సురేంద్ర బాబు రూ.50 లక్షలు, విజయవాడ క్లబ్ తరపున సెక్రటరీ పి.చంద్రశేఖర్ రావు, శైలేష్, రాజా రూ.50 లక్షలు, టీడీపీ నేత కోటంరెడ్డి శ్రీనివాసరెడ్డి రూ.5 లక్షలు, కోటం సంధ్య రూ.5 లక్షలు, సిశ్వాన్ ఇన్ ఫ్రా రూ.5 లక్షలు, స్వాతంత్ర్య సమరయోధులు-సర్వోదయ ట్రస్ట్ తరపున డా.మోహన్ కృష్ణ రూ.1.50 లక్షలు, వై.చలపతి రావు, పరుచూరి శ్రీనివాసరావు, సీహెచ్ దీపిక, బొప్ప అనురాధ లక్ష చొప్పున సీఎం సహాయనిధికి విరాళాలు అందజేశారు. తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం ఒక రోజు మూల వేతనం విరాళంగా అందజేసింది. ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు వరద బాధితులను ఆదుకునేందుకు ముందుకొచ్చి స్ఫూర్తి దాయకంగా నిలుస్తున్నందుకు దాతలకు సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు.

విజయవాడ ముంపు నివారణకు శాశ్వత పరిష్కారం

(మొదటిపేజీ తరువాయి)

వస్తోందని తెలిపారు. ఈ రాత్రికి నీటిని ఎట్టి పరిస్థితుల్లోనైనా తొలగించేలా పనులు పూర్తిచేస్తామని అన్నారు. అయితే ఈరోజు రాత్రికి వర్షం పడితే మరలా బుడమేరుకు పై నుంచి నీరు వచ్చే అవకాశం ఉంటుందని చెప్పారు. 32 వార్డులను డివిజన్‌ల కింద విభజించి అక్కడ ఉన్న వారికి సమాచారం ఇస్తున్నామని వెల్లడించారు. 224 ట్యాంకర్ల ద్వారా తాగునీటిని అందించామని, 24 ట్యాంకులు శానిటేషన్‌కు వాడుతున్నామని వెల్లడించారు. ప్రజలు పైప్ కనెక్షన్‌ల నుంచి వచ్చే తాగు నీటిని ఇంకా రెండు రోజుల పాటు వాడొద్దని, పైపుల్లో బురద నీరు వచ్చే అవకాశం ఉండటంతో వాడొద్దని సూచించామని అన్నారు. భారీ వర్షాలతో పాడైన 490 కిలో మీటర్లు రోడ్లను మరమ్మత్తులు చేస్తున్నట్లు వివరించారు. అలాగే భారీ వర్షాలతో వరదలతో నిండిపోయిన 10వేల ఇళ్లను ఇప్పటికే శుభ్రం చేశామని.... రాత్రికి మరో 15వేల ఇళ్లను శుభ్రం చేస్తామని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ కనెక్షన్లు ఇచ్చామని, 161 పవర్ బోట్లు ఇంకా అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. రానున్న మూడు రోజుల్లో 100 శాతం మందికి చేయాల్సిన సాయం చేస్తామని, వరదల నుంచి విజయవాడకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు చేపడతామని చంద్రబాబు స్పష్టం చేశారు.

ప్రతి గడపకూ ప్రభుత్వ సాయం

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: వరదలతో నష్టపోయిన ప్రతి ఒక్కరికీ సాయం అందేలా చూస్తామని రాష్ట్ర భూగర్భ వనరుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. గన్నవరం నియోజకవర్గం పరిధిలోని అంబాపురం వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుతో కలిసి ఆయన శుక్రవారం పర్యటించారు. బుడమేరు కాలువపై విజయవాడ వైపుగా మూడు గండ్లు పడ్డాయని, వాటిలో ఇప్పటికే రెండు పూడ్చేశామని, ఆర్మీ సహాయంతో మూడో గండిని పూడ్చే పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. గత పాలకుల తప్పిదాలకు విజయవాడ నగరం అతలాకుతలమైపోయిందన్నారు. బుడమేరును బాగు చేయకపోగా కట్టల్ని తవ్వుకుని ఆ మట్టిని అమ్ముకున్నారని విమర్శించారు. కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఇప్పటికే వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారని... రైతులందరికీ కేంద్రం నుండి సాయం అందిస్తామని హామీ ఇచ్చారన్నారు. ప్రధానంగా వరి, పసుపు, కంద, అరటి రైతులు తీవ్రంగా నష్టపోయారని వివరించామన్నారు. వరద బాధితుల వివరాలన్నీ సమగ్రంగా సేకరిస్తున్నామని, ఇప్పటికే మరణించిన వారి కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున చెక్కులు అందించామని తెలిపారు. సహాయ పునరావాస కార్యక్రమాల పర్యవేక్షణ, సమన్వయం కోసం మూడు డివిజన్లకు ఒక ఐఏఎస్ అధికారి, సచివాలయ సిబ్బంది, పార్టీ సీనియర్ నాయకుడు, ఇతర కార్యకర్తల్ని రంగంలోకి దించినట్లు చెప్పారు.

హర్యానాలో ఆప్ ఒంటరి పోరు?

న్యూఢిల్లీ: హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో సీట్ల సర్దుబాటు కొలిక్కి రాకపోవడంతో ఒంటరిగానే పోటీచేయాలని ఆప్ భావిస్తున్నట్లు తెలిసింది. పొత్తులపై ఇరు పార్టీల స్థానిక నేతల నుంచి వ్యతిరేకత రావడంతో 'కూటమి'గా ముందుకెళ్లడంపై ప్రతిష్టంభన ఏర్పడింది. "హర్యానాలో పొత్తుపై కాంగ్రెస్‌తో జరుపుతోన్న చర్చలు పతనావస్థలో ఉన్నాయి. దీంతో రాష్ట్రంలో ఒంటరిగానే పోటీ చేయాలని భావిస్తున్నాం. 50 స్థానాల్లో పోటీ చేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నాం" అని కాంగ్రెస్‌తో చర్చల్లో పాల్గొన్న ఆప్ వర్గాలు వెల్లడించాయి. అభ్యర్థుల తొలి జాబితా సెప్టెంబర్ 8న విడుదల చేసే అవకాశం ఉందని వెల్లడించాయి.

జాతీయ స్థాయిలో విపక్షాల ఇండియా ఐక్యసంఘటనలో ఉన్న కాంగ్రెస్-ఆప్‌లు ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో హర్యానా, గుజరాత్, ఢిల్లీలో కలిసి పోటీ చేశాయి. ప్రస్తుత హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లోనూ కలిసి ముందుకు వెళ్లాలని రెండు పార్టీలు భావించినప్పటికీ సీట్ల సర్దుబాటుపై ఏకాభిప్రాయానికి రాలేకపోయాయి. పది అసెంబ్లీ సీట్లను తమకు ఇవ్వాలని ఆప్ డిమాండ్ చేస్తుండగా... ఐదు నుంచి ఏడు సీట్లు ఇచ్చేందుకు కాంగ్రెస్ సిద్ధంగా ఉన్నట్లు తెలిసింది. హర్యానాలో 90 స్థానాలకు అక్టోబర్ 5న ఒకేరోజు పోలింగ్ జరగనుండగా... అక్టోబర్ 8న ఓట్ల లెక్కింపు ఉంటుంది.

వైసీపీ నేతలకు వరదలపై మాట్లాడే అర్హత లేదు: మంత్రి డోలా

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: వైసీపీ నేతలకు వరదల గురించి మాట్లాడే నైతిక అర్హత లేదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి అన్నారు. శుక్రవారం ఆయన విజయవాడ జక్కంపూడిలో పర్యటించారు. వరద బాధితులకు వైద్యం అందిస్తున్న శిబిరాలను మంత్రి పరిశీలించారు. ఫిట్స్ వచ్చిన మహిళకు దగ్గరుండి వైద్యం చేయించారు.

బుడమేరు ముంపునకు శాశ్వత పరిష్కారం

ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి డిమాండ్

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్): విజయవాడను వరద ముంచెత్తడానికి రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికారుల అలసత్వమే కారణమని ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు ధ్వజమెత్తారు. దీనిని కేంద్రం జాతీయ విపత్తుగా ప్రకటించాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్తంగా బాధితులను అన్ని విధాలుగా ఆదుకోవాలని, బుడమేరు ముంపు సమస్యను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ చౌహాన్ కి వినతిపత్రం అందజేశామని చెప్పారు. శుక్రవారం గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో కేంద్రకార్మిక సంఘాలు, రైతుల సంఘాల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... యుద్ధ ప్రాతిపదికన బాధితులకు నిత్యావసర వస్తువులు, తాగు నీరు అందించాలన్నారు. తీవ్రంగా నష్టపోయిన రైతాంగానికి రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులను గుర్తించి... సర్వే చేసి పూర్తిగా పంట నష్టపరిహారం అందించాలన్నారు. బుడమేరు ముంపు నివారణకు శాశ్వత పరిష్కారాన్ని కనుగొనాలని...గతంలో అనేక కమిషన్లు చెప్పిన విధంగా చర్యలు చేపట్టాలన్నారు. వరద ముంచుకొస్తున్న విషయాన్ని స్థానిక ప్రజలకు తెలియజేయడంలో అధికారులు, ప్రభుత్వం విఫలమయ్యాయన్నారు. రోజులు గడుస్తున్నా నీరు పెరుగుతోంది తప్ప తరగటం లేదని ఆందోళన వక్తం చేశారు. నిజమైన లబ్ధిదారులను గుర్తించి... నష్టపరిహారంతో పాటు,ఉపాధి అవకాశాలు, రుణాలు కల్పించాలన్నారు.

10న విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం రాష్ట్ర వ్యాప్త నిరసనలు

ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.రవీంద్రనాధ్ మాట్లాడుతూ ఈనెల 10న విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా రాస్తారోకోలు నిర్వహిస్తామని, విజయవాడ అలంకార సెంటర్‌లో రాస్తారోకో నిర్వహిస్తామని ప్రకటించారు. అలాగే కేంద్ర కార్మిక సంఘాలు ఈనెల 23న ఆందోళనకు పిలుపునిచ్చాయని త్వరలో దాని వివరాలను తెలియజేస్తామన్నారు. ప్రధానంగా విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం 1400 రోజులుగా అక్కడ ఆందోళనలు జరుగుతున్నాయని... అనేక సందర్భాల్లో రాష్ట్ర వ్యాప్తంగా రాస్తారోకోలు చేపట్టినప్పటికీ విశాఖ ఉక్కును నిర్వీర్యం చేసే విధంగా ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం వచ్చినా కూడా మోసపూరితమైనటువంటి మాటలతో తప్పుడు సమాచారంతో కార్మిక వర్గాన్ని, రాష్ట్ర ప్రజలను వంచించే ప్రకటనలు చేస్తున్నారన్నారు. ఉక్కు ప్యాక్టరిని అవసరమైన గనులు, బొగ్గు వంటివి కేటాయించాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కును రక్షించుకోవడానికి కార్మిక సంఘాలు ఎంతకైనా పోరాటం చేయటానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి జి .ఓబులేసు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మలినీడి యలమందరావు, రైతు సంఘాల నాయకులు వై కేశవరావు, ఎం వెంకటరెడ్డి, ఎం కృష్ణయ్య, సింహాద్రి ఝాన్సీ, చుండూరు రంగారావు, డాక్టర్ కొల్లా రాజమోహన్, డీ హరినాథ్,మరీదు ప్రసాద్ బాబు, వీరబాబు, డాక్టర్ చల్లపల్లి విజయ, కాసాని గణేష్ బాబు, నరసింహారావు, గోగినేని ధనశేఖర్, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి నరసింగరావు తదితరులు పాల్గొన్నారు. తొలుత రాష్ట్ర రైతు సంఘాల, కార్మిక సంఘాల ఐక్యవేదిక సమావేశం జరిగింది. సమావేశంలో వరద బాధితులను తక్షణం ఆదుకోవాలని, విశాఖ ఉక్కు పరిరక్షణకు కృషి చేయాలని తీర్మానాలు చేశారు.

వరద బాధితుల సహాయార్థం రూ.12 కోట్లు

ఆంధ్రప్రదేశ్ పోలీసు అధికారుల సంఘం

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి ఒకరోజు వేతనం రూ.12 కోట్లు డీజీపీ ద్వారకా తిరుమలరావు చేతుల మీదుగా అందించినట్టు ఆంధ్రప్రదేశ్ పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జనకుల శ్రీనివాసరావు తెలిపారు. గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజల ప్రాణాలు కాపాడటం, ఆస్తి నష్టం జరగకుండా నిరంతరం కృషిచేయడం పోలీసుల కర్తవ్యమన్నారు. విధి నిర్వహణలో మానవత్వాన్ని, సేవాభావాన్ని ప్రదర్శిస్తూ పోలీసులు ప్రజల మన్ననలను అందుకోవడం గర్వంగా ఉందని తెలిపారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి మస్తాన్ ఖాన్, కోశాధికారి ఎం. సోమశేఖర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు కే నాగిని, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఎం. సోమయ్య పాల్గొన్నారు.

సోలార్ ప్లాంట్ వద్దే వద్దు

ఉయ్యాలవాడ రైతుల ఆందోళనకు రైతు సంఘాల మద్దతు

విశాలాంధ్ర - బ్యూరో కర్నూలు: ఉయ్యాలవాడ గ్రామంలో సోలార్ పరిశ్రమ వద్దే వద్దంటూ నినదిస్తూ కలెక్టర్, తహశీల్దార్ కార్యాలయం ముందు రైతులు గ్రామస్తుల అధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఏపీ రైతు సంఘాలు మద్దతు తెలిపాయి. ఈ సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం గౌరవ అధ్యక్షులు పి.రామచంద్రయ్య, ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, జిల్లా కార్యదర్శి జగన్నాథం, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి.నాగన్న, రైతు సంఘం నాయకులు రమేష్, మధుసూదన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉయ్యాలవాడ గ్రామంలో సోలార్ ప్లాంట్ నిర్మాణం చేపడతామని గత క్యాబినెట్ తీర్మానం చేయడంతో రైతులు వివిధ రూపాలలో తమ ఆందోళన తెలియజేశారని అన్నారు. మొత్తం గ్రామమంతా ముక్తకంఠంతో తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపిందని, ఎన్నికల కోడ్ రావడంతో ఆందోళన ఆగిందని తెలిపారు. అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులు గ్రామానికి వచ్చినప్పుడు గ్రామంలో సోలార్ పరిశ్రమ తమకు వద్దంటూ ప్రజలు వినతులు కూడా ఇచ్చారన్నారు. ఆ సందర్భంగా తాము అధికారంలోకి వస్తే సోలార్ ప్లాంట్ రాకుండా అడ్డుకుంటామని టీడీపీ నాయకులు హామీ ఇచ్చారని అన్నారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మళ్లీ అధికారులు ఊరిలో సర్వే చేయడం కోసం రావడంతో రైతులు, ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారని చెప్పారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం రైతులతో గ్రామ సభ జరిపి, వారి ఆమోదం లేకుండా భూములను తీసుకోవద్దని డిమాండ్ చేశారు. సోలార్ ప్లాంట్ కోసం ఉన్న భూములు తీసుకుంటే అక్కడ పశువులకు, గొర్లకు మేత లేక ఇబ్బందులు వస్తాయని, ఊరంతా ఖాళీ చేసి సుదూర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేసి, క్యాబినెట్ తీర్మానాన్ని వెనక్కి తీసుకొని సోలార్ ప్లాంటును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల పొలాలను, పశువులు, గొర్ల కాపర్ల జీవనాన్ని దెబ్బతీయవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు మహబూబ్ బాషా, రామకృష్ణ, సుబ్బరాయుడు, హుస్సేన్, వెంకటరమణ, తిరుపతయ్య, శ్రీరాములు, వేణుగోపాల్, బ్రహ్మాచారి, సరస్వతి, మధు, ఏపీ రైతు సంఘం నాయకులు డి.శ్రీనివాసరావు, వందలాది మంది రైతులు పాల్గొన్నారు.

జాతీయ విపత్తుగా ప్రకటించండి

వరద బాధితులకు సీపీఐ విరాళాల సేకరణ

విశాలాంధ్ర-అనంతపురం: రాష్ట్రంలో ఉభయగోదావరి, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో సంభవించిన వరదకు లక్షలాదిమంది నిరాశ్రయులు అయ్యారని, బాధితులను ఆదుకోవడానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జగదీశ్ పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పిలుపుమేరకు జగదీశ్ పర్యవేక్షణలో జిల్లాలో శుక్రవారం పెద్ద ఎత్తున విరాళాలు సేకరించారు. స్థానిక పాతూరు గాంధీ విగ్రహం మొదలుకొని వివిధ ప్రాంతాల్లో నగర సమితి, నగర కార్యదర్శి శ్రీరాముల అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జగదీశ్ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా వరద బాధితుల కోసం విరాళాలను సేకరించినట్టు చెప్పారు. నగదు, వంట పాత్రలు, దుస్తులు విజయవాడలోని సీపీఐ రాష్ట్ర కార్యాలయానికి తరలించడం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధికి చెక్కుల రూపంలో అందిస్తా మన్నారు. కేంద్రం రూ.పదివేల కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మోదీ స్వయంగా వరద ప్రాంతాల్లో పర్యటించి జాతీయ విపత్తుగా ప్రకటించాలని కోరారు. జిల్లా కార్యదర్శి జాఫర్ మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు జిల్లాలో పెద్ద ఎత్తున విరాళాలు సేకరిస్తున్నట్టు వెల్లడించారు. ప్రజలు స్వచ్ఛందంగా విరాళాలను ఇవ్వడం అభినంద నీయమన్నారు. జిల్లా సహాయ కార్యదర్శి నారాయణ స్వామి మాట్లాడుతూ వ్యాపారులు, రైతులు, కార్మికులు స్వచ్ఛందంగా విరాళాలు ఇవ్వడం శుభపరిణామమన్నారు. నగర సహాయ కార్యదర్శులు రమణ, అల్లిపిరా, జిల్లా కార్యవర్గ సభ్యుడు లింగమయ్య, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోశ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి రమణయ్య, కుళాయి స్వామి, నగర అధ్యక్షుడు మంజునాథ్, సమీర్, నాని, తరుణ్, వరుణ్, అభిషేక్, కార్తీక్ పాల్గొన్నారు.

మద్యం దుకాణాల్లో ఉద్యోగుల బంద్ తాత్కాలిక వాయిదా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఏపీ స్టేట్ బేవరెజెస్ కార్పొరేషన్ కాంట్రాక్టు అండ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం ఈ నెల 7 న తలపెట్టిన సమ్మె ను తాత్కాలిక వాయిదా వేస్తున్నట్లు యూనియన్ ప్రతినిధులు రామచంద్రరావు, చరణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకృతి విపత్కర పరిస్థితుల్లో విజయవాడ పరిసర ప్రాంతాలన్నీ నీట మునిగిపోవడంతో అధికార యంత్రాంగం పూర్తిగా రక్షణ చర్యల్లో నిమగ్నమై ఉండటం వల్ల పాలసీ ప్రకటించే యోచనలో ప్రభుత్వం లేనందున బంద్‌ను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు వారు ప్రకటించారు. కాగా, ఈ నెల 15న ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించడం శుభ పరిణామమని, ఉద్యోగులెవరూ అధైర్య పడవద్దని, ప్రభుత్వం నుంచి సానుకూలమైన స్పందన రాని పక్షంలో రాష్ట్ర యూనియన్ నాయకులు ప్రతి డిపోలో ఉన్న యూనియన్ ప్రతినిధులతో చర్చించి తక్షణ బంద్ ప్రకటించేందుకు కూడా వెనుకడుగు వేయదని పేర్కొంది. ఉద్యోగులు అందరూ విజయవాడలోని ప్రకృతి విపత్కర పరిస్థితిని గమనించి మానవతా దృక్పథంతో ఆలోచించాలని వారు విజ్ఞప్తి చేశారు.

విట్ అమరావతి భారీ వితరణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వరద బాధితుల సహాయార్థం వీఐటీ (విట్) ఏపీ యూనివర్సిటీ (అమరావతి) వ్యవస్థాపకులు డాక్టర్ విశ్వనాథన్, వైస్ ప్రెసిడెంట్ శంకర్ విశ్వనాథన్ ఒక కోటి 50 లక్షల రూపాయలు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు కలిసి రూ.7 లక్షల 50 వేలు... మొత్తం కోటి 57 లక్షల 50 వేలు సీఎం సహాయ నిధికి అందజేశారు. శుక్రవారం విజయవాడలోని కలెక్టరేట్ ఆఫీసు నందు సీఎం చంద్రబాబుకు విరాళాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ ఎస్.వి.కోటారెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ జగదీశ్ చంద్ర ముదిగంటి పాల్గొన్నారు.

వరద బాధితులకు 5 రకాల తినుబండారాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వరద బాధితులకు పంపిణీ చేసేందుకు ప్రత్యేకంగా ఐదు రకాల తినుబండారాలు విజయవాడ నగర పాలక సంస్థ, జిల్లా యంత్రాంగం సిద్ధం చేస్తోంది. అమ్మ కళ్యాణ మండపం, సిద్ధార్థ ఆర్ట్స్ కళాశాలలో ప్యాకింగ్ చేస్తున్నారు. ప్యాకింగ్ చేసే ఒక్కో ప్యాక్‌లో ఆరు యాపిల్స్, ఆరు బిస్కట్ ప్యాకెట్‌లు, రెండు లీటర్ల పాల ప్యాకెట్లు, మూడు నూడిల్స్ ప్యాకెట్లు, రెండు లీటర్ల వాటర్ బాటిళ్లు ఉంటున్నాయి. వరద బాధితులందరికీ అందేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆరు లక్షల ఆపిల్స్, ఆరు లక్షల బిస్కట్ ప్యాకెట్లు, మూడు లక్షల వాటర్ బాటిళ్లు, మూడు లక్షల లీటర్ల పాల ప్యాకెట్‌లు, నాలుగు లక్షల నూడిల్స్ ప్యాకెట్లను వరద బాధితుల కోసం వాలంటీర్లు, సిబ్బంది ప్యాకింగ్ చేస్తున్నారు.

విశాఖ ప్లాంట్ నుంచి మంచినీటి బాటిళ్లు ఇవ్వాలి

రైల్వే శాఖ మంత్రికి షర్మిల లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విశాఖ రైల్‌నీర్ ప్లాంట్ నుంచి విజయవాడ వరద ముంపు బాధితులకు బాటిళ్లు అందించాలని రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు షర్మిల శుక్రవారం ఒక లేఖ రాశారు. ప్రస్తుతం విజయవాడలో దారుణమైన పరిస్థితి నెలకొందని, భారీ వర్షాలతో అపారమైన నష్టం వాటిల్లిందని వివరించారు. నగరం, చుట్టుపక్కల వాగులు, కాల్వలు పొంగి పొర్లుతున్నాయని వివరించారు. దీంతో అనేక కాలనీలు ఇంకా వరదలోనే ఉన్నాయని, పెద్ద ఎత్తున ప్రాణ నష్టం జరిగిందన్నారు. తాగునీటి సరఫరా పైపులైన్లు భారీగా మట్టితో నిండిపోయాయని, తాగునీరు విషయంలో విషయంలో నగరం ఇప్పుడు పెద్ద సవాలును ఎదుర్కొంటోందని పేర్కొన్నారు. ఉన్న నీరు తాగేందుకు, వండుకోవడానికి కూడా పనికిరాకుండా పోయిందని, సిల్ట్‌ను తొలగించి మళ్లీ నీటిని సురక్షితంగా మార్చే ప్రక్రియ చాలా సమయం తీసుకుంటుందని తెలిపారు. రోజుకు దాదాపు లక్ష బాటిళ్ల సామర్థ్యంతో విశాఖపట్నం సమీపంలో రైల్ నీర్ ప్లాంట్ ఇటీవల కార్యకలాపాలు ప్రారంభించిందని పేర్కొన్నారు. వాటి ద్వారా విజయవాడలోని ప్రభావిత ప్రాంతాలకు నీటి సరఫరా చేయాలని కోరారు. ఈ అత్యవసర పరిస్థితి దృష్ట్యా, తక్షణమే జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు.

ఐదు రోజుల్లో 10 లక్షల మందికి ఆహారం

అక్షయపాత్ర ప్రెసిడెంట్ వంశీదాస ప్రభు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: గత ఐదు రోజులుగా సుమారు 10 లక్షల మంది వరద బాధితులకు ఆహారం అందించా మని అక్షయపాత్ర విజయవాడ, గుంటూరు ప్రెసిడెంట్ వంశీదాస ప్రభు చెప్పారు. దివీస్ ల్యాబ్, ప్రభుత్వ సహకారంతో రికార్డు స్థాయిలో బాధితులకు ఆహారాన్ని అందించామన్నారు. ప్రభుత్వం ఎప్పుడు ఎంత అడిగినా అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని వంశీదాస చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతోనే ఇంత మందికి అందించగలిగామన్నారు. తాము ఎంత ఆహారం వండినా... దానిని బాధితుల వద్దకు చేర్చడం గొప్ప విషయమన్నారు. అక్షయపాత్ర చరిత్రలో 10 లక్షల మందికి ఆహారం అందించడం రికార్డు అని పేర్కొన్నారు. ప్రభుత్వం ఎన్ని రోజులు చేయమంటే అన్ని రోజులు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

ఉన్నత విద్యా మండలి నిర్లక్ష్యానికి విద్యార్థి బలి

కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం: ఏఐవైఎఫ్ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉన్నత విద్యా మండలి అధికారుల నిర్లక్ష్యంతో ఒక విద్యార్థి ప్రాణం పోయిందని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర సహాయ కార్యదర్శి మహంకాళి సుబ్బారావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వర్షాలు, వరదలతో ప్రజలు ఇబ్బంది పడుతుంటే... ఉన్నత విద్యా మండలి అధికారులు మాత్రం తమకేం సంబంధం లేనట్లుగా ఓ విద్యార్థి ప్రాణం పోవడానికి కారుకులయ్యారని ఆరోపించారు. డిగ్రీ ప్రవేశాల రెండో విడతలో భాగంగా గత నెల 29న సీట్లు కేటాయించారని, సీటు పొందిన విద్యార్థులు ఈనెల 3వ తేదీ నాటికి స్వయం నివేదిక చేయాలని ఉన్నత విద్యాశాఖ ఆదేశాలు ఇచ్చారని గుర్తుచేశారు. గత నెల 31వ తేదీ నుంచి రాష్ట్రంలో భారీ వర్షాలు, బుడమేరు ముంపు కారణంగా విజయవాడ నగరంలోని అనేక ప్రాంతాలను వరద ముంచెత్తిందని గుర్తుచేశారు. ఆ రోజు ఉన్నత విద్యాశాఖ కనీసం సెలవు ప్రకటించకపోవడంతో విద్యార్థులు వర్షం, వరదలు వస్తున్నప్పటికీ, తప్పనిసరిగా కళాశాలల్లో స్వయం నివేదిక ఇవ్వాల్సి వచ్చిందన్నారు. విజయవాడ అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన కొడాలి యశ్వంత్‌కుమార్ అనే విద్యార్థికి ఒన్‌టౌన్‌లోని కేబీఎన్ కళాశాలలో ప్రవేశాలు కల్పించారని, తప్పనిసరి పరిస్థితుల్లో కళాశాలలో స్వయం నివేదిక చేసేందుకు ఈనెల మూడో తేదీన పడవల సాయం తీసుకుంటూ వెళ్లేందుకు ప్రయత్నించి, చివరికి గల్లంతయ్యాడని వివరించారు. నాల్గవ తేదీన యశ్వంత్ కుమార్ మృతదేహం బయటపడిందని, ఉన్నత విద్యా మండలి అధికారులు ప్రవేశాలపై ముందస్తుగా ప్రకటించి ఉంటే... ఆ విద్యార్థి ప్రాణాలు పోయేవి కావని వారన్నారు. విద్యార్థి మృతికి కారకులైన ఉన్నత విద్యామండలి ఇన్‌చార్జి చైర్మన్ కె.రామమోహన్‌రావు, అధికారులపై కేసు నమోదు చేయాలని, విద్యార్థి కుటుంబానికి రూ.25 లక్షల నష్టపరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు.

అధికార మదంతోనే టీడీపీ కార్యాలయంపై దాడి: వర్ల రామయ్య

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అధికార మదంతోనే మంగళగిరి తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంపై దాడి జరిగిందని ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య అన్నారు. శుక్రవారం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల మాజీ ఎంపీ నందిగం సురేశ్‌ను మంగళగిరి పోలీసులు హైదరాబాద్‌లో అరెస్టు చేసిన సంగతి తెలిసిందేనని, ఆయన పాత్రధారి మాత్రమేనని, అసలు సూత్రధారులు ఎవరో తేల్చి వారిని త్వరగా అరెస్టు చేయాలని కోరారు. అప్పటి సీఎం జగన్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు సజ్జలకు తెలియకుండా జరిగిందా అని ప్రశ్నించారు. వారు అధికారాన్ని అడ్డం పెట్టుకుని దాడి చేయటం, కేసును సరిగ్గా విచారణ చేయకుండా పక్కన పడేశారని ఆరోపించారు. అరెస్టు అయిన వారిని, అరెస్టు కాబోతున్న వారిని కూడా పోలీసు కస్టడీలోకి తీసుకొని విచారణ చేయాలని కోరారు. ఇందులో జగన్ రెడ్డి పాత్ర ఏంటి? సజ్జల పాత్ర ఏంటి? ఇంటెలిజెన్స్ వారి పాత్ర ఏంటి? నిగ్గు తేల్చాలని, కుట్ర మొత్తం బయటకు రావాలని వర్ల రామయ్య అన్నారు.

అడవుల విధ్వంసానికి పాల్పడితే కఠిన చర్యలు

అటవీశాఖ అధికారి చిరంజీవ్ చౌదరి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అటవీశాఖపై మీడియాలో వస్తున్న వార్తలకు ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ చిరంజీవ్ చౌదరి స్పందించారు. రాజమండ్రి ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం ఈ ఏడాది ఫిబ్రవరి 28 నుంచి మార్చి 7 వరకు రంపచోడవరం డివిజన్‌లో నిర్దిష్ట క్షేత్ర తనిఖీలు నిర్వహించగా, అటవీ ప్రాంతాల్లో టేకు, వివిధ రకాల చెట్ల నరికివేతలను గుర్తించడం జరిగిందన్నారు. దీనిపై విచారణ కోసం మంగళగిరి, గుంటూరు, విశాఖపట్నం డివిజనల్ ఫారెస్ట్ అధికారులతో మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ బృందాలు రంపచోడవరం డివిజన్‌లో క్షుణ్ణంగా విచారణ జరిపి ప్రధానంగా రెండు బీట్లలో... దేవరపల్లి, మారేడుమిల్లి సౌత్‌లో విధ్వంసం జరిగిందని, రూ.61 లక్షల విలువైన 413 చెట్లను దుండగులు నరికివేసినట్లు గుర్తించారన్నారు. విచారణ బృందాల నివేదిక ఆధారంగా స్టంప్ సైట్ వద్ద ఉన్న టేకు కలపను జప్తు చేసి, దానిని ప్రభుత్వ కలప డిపోకు రవాణా చేయాలని రాజమండ్రి సీసీఎఫ్‌ను ఆదేశించామన్నారు. అపహరణకు గురైన కలపను తిరిగి స్వాధీనం చేయాలని, తప్పు చేసిన అధికారులపై చర్యలకు ఆదేశించినట్లు తెలిపారు. అడవుల విధ్వంసాన్ని గుర్తించడంలో విఫలమైనందుకు రంపచోడవరం రేంజ్ అధికారిని సస్పెండ్ చేసి క్రమశిక్షణా చర్యల నిమిత్తం ఏవోసీ జారీ చేశామన్నారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ నుంచి ఇచ్చిన ఛార్జ్‌షీట్‌కు వివరణను పొందిన తరువాత, సీసీఏ రూల్స్ అనుసరించి, నెలన్నర తర్వాత తిరిగి విధుల్లోకి తీసుకున్నట్లు వివరించారు. ఫారెస్ట్ రేంజ్ అధికారిని తిరిగి విధుల్లోకి తీసుకున్న తర్వాత చింతూరు రేంజ్‌లో నియమించారన్నారు. దీంతో పాటు 2022-23, అలాగే 2023-24 మధ్యకాలంలో సీబీఈటీ పనుల్లో అవకతవకల ఆరోపణలపై విచారించేందుకు డీఎఫ్ఓ, విశాఖపట్నం విజిలెన్స్ వారితో ప్రత్యేక బృందం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ ప్రత్యేక బృందం నుంచి తుది నివేదిక అందిన తర్వాత తదుపరి తగిన చర్యలు తీసుకుంటామని చిరంజీవ్ చౌదరి శుక్రవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. అడవుల విధ్వంసానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సెలవులే... సెలవులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విద్యా సంస్థలకు ఈ నెలలో అధికంగా సెలవులు రానున్నాయి. ఇప్పటికే వర్షాలు, వరదల ప్రభావంతో ఈనెల 2వ తేదీ నుంచి ఆయా ప్రభావిత జిల్లాల్లో కలెక్టర్లు సెలవులను ప్రకటించారు. కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, ఏలూరు, రాజమహేంద్రవరం తదితర జిల్లాల్లో వరదలతో విద్యా సంస్థలు మూతపడ్డాయి. ఆ సెలవులు వరద ప్రభావిత ప్రాంతాలకే పరిమితం కాగా... ఈ నెలలో రాష్ట్ర వ్యాప్తంగా విద్యా సంస్థలకు అధికంగా సెలవులు రానున్నాయి. ఈనెల 7వ తేదీ శనివారం వినాయక చవితి రావడం, మరుసటి రోజు ఆదివారం వచ్చింది. దీంతో వరుసగా రెండు రోజులు పాఠశాలలకు సెలవులు వచ్చాయి. ఇదే నెలలో 14వ తేదీ రెండో శనివారంతో సెలవు రానుంది. మరుసటి రోజు 15 ఆదివారం, ఆ తర్వాత 16వ తేదీ సోమవారం మిలాద్-ఉన్-నబీ పండుగతో పాఠశాలలకు వరుసగా మూడు రోజులు సెలవులు వచ్చాయి. ఇలా ఒకే నెలలో అధికంగా సెలవులు వచ్చినప్పుడు తెలుగు రాష్ట్రాల మధ్య పెద్దఎత్తున విద్యార్థులు, తల్లిదండ్రులు రాకపోకలు కొనసాగిస్తారు. ప్రస్తుతం రెండు రాష్ట్రాల్లోనూ వరదలు ముంచెత్తడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అయితే ఇప్పుడు మళ్లీ వాహనాలను పునరుద్ధరించారు. సెలవులు వచ్చినప్పటికీ, వర్షాలు, వరదల భయంతో ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అంతగా ఆసక్తి చూపడం లేదు. కేవలం ఇళ్లకే పరిమితమై పోతున్నారు. ప్రైవేట్ జూనియర్ కళాశాలలకు ప్రభుత్వం ప్రకటించిన సెలవులకు విరుద్ధంగా కొనసాగిస్తున్నట్లు తెలిసింది. పేరుకు విద్యార్థులకు సెలవులు ప్రకటించి... ఆయా రోజుల్లో ఆన్ లైన్‌లో తరగతులు నిర్వహిస్తున్నారు.

వరదలో చంద్రశేఖర్ మృతి బాధాకరం: అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: బుడమేరు వరద ఉధృతిలో వీరోచితంగా నలుగురి ప్రాణాలను కాపాడి తాను ప్రాణాలు కోల్పోయిన పలిశెట్టి చంద్రశేఖర్ మృతి చాలా బాధాకరమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు విచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు అచ్చెన్నాయుడు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ, చంద్రశేఖర్ నిస్వార్థంగా తక్కువ ధరకు నాణ్యమైన పాలు చుట్టుపక్కల ప్రజలకు అందిస్తున్నారని తెలిసిందని, నలుగురు ప్రాణాలు కాపాడాలనే ఉద్దేశంతో అక్కడకు వెళ్లిన యువకుడు అనుకోని విధంగా అక్కడ మృతి చెందడం బాధాకరమని పేర్కొన్నారు. బుడమేరు వరద కారణంగా చంద్రశేఖర్ మృతి చెందడం, గేదెలు వరద ఉధృతికి కొట్టుకపోవడం చంద్రశేఖర్ కుటుంబంలో తీరని విషాదం మిగిల్చిందన్నారు. ఆయన కుటుంబానికి మంత్రి అచ్చెన్నాయుడు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. చంద్రశేఖర్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.

సంపాదకీయం

హర్యానాలో బీజేపీ టికెట్ల పంపిణీ రసాభాస

భారతీయ జనతా పార్టీ విభిన్నమైంది అనే సాహసం ఇప్పుడు చేయలేం. హర్యానా శాసనసభకు జరగనున్న ఎన్నికల్లో కొంత మంది మంత్రులతో సహా అనేక మంది ప్రస్తుత ఎమ్మెల్యేలకు కూడా టికెట్లు నిరాకరించడంలో బీజేపీ తీరే వేరు. అందువల్ల విశిష్టమైన పార్టీ అనొచ్చు. ఆ విశిష్టత చాలా మందిని మాజీ మంత్రులను, మాజీ శాసనసభ్యులను చేయడంలో ఉంది. అనేక సంవత్సరాలుగా బీజేపీని నమ్ముకుని ఉన్న వారికి టికెట్లు లేకుండా చేసిన బీజేపీ ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి మాత్రం ఉదారంగా టికెట్లు ఇచ్చేస్తోంది. 90 స్థానాలున్న హర్యానా శాసనసభకు పోటీ చేసే 67 మంది జాబితా బీజేపీ ప్రకటించేసింది. హర్యానా బీజేపీ నాయకుల పని ఇప్పుడు తల గొరిగించుకుంటే వడగండ్ల వాన అన్న చందంగా తయారైంది. ఎన్నికల సమయంలో పోటీ చేసే అభ్యర్థుల పేర్లు ప్రకటించగానే చాలా సందర్భాలలో రాజకీయ పార్టీలలో పొగలు, సెగలు సర్వసాధారణం. కానీ ఇప్పుడు టికెట్లు ఆశించిన, దీర్ఘకాలికంగా బీజేపీనే నమ్ముకున్న వారిని బీజేపీ అధిష్ఠానవర్గం ఉపేక్షించింది. వారు నొచ్చుకుంటున్నారు. మొహం మాడ్చుకుంటున్నారు. టికెట్ ఇవ్వకపోయినా స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసి గెలవగలమన్న ధీమా, ఆత్మ విశ్వాసం, నమ్మకం ఉన్న వారు తిరుగుబాటు చేస్తున్నారు. స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేయడానికి సిద్ధ పడుతున్నారు. వీరందరూ జనబలం ఉన్న వారని చెప్పడానికి సందేహించనక్కర్లేదు. అయితే గెలిచే అవకాశం ఉన్న బీజేపీ నేతలకు, టికెట్ ఆశించిన వారికి నిరాశే మిగులుతోంది. నాలుగు రోజుల ముందు, రెండు రోజుల ముందు ఇతర పార్టీలలో ఉన్న వారు బీజేపీలోకి ఫిరాయిస్తే బీజేపీ నాయకత్వం వారిని అక్కున చేర్చుకుని ఆదరించి టికెట్లు కేటాయిస్తోంది. అభ్యర్థులను ఖరారు చేయడానికి బీజేపీ అధినాయకత్వం కొన్ని వారాల నుంచే కసరత్తు చేస్తోంది. 67 మందితో మొదటి జాబితా రాగానే కనీసం డజను స్థానాల్లో తిరుగుబాట్లు మొదలైంది. ప్రస్తుతం మంత్రులుగా ఉన్న ముగ్గురికి టికెట్లు దక్కనే లేదు. తాజాగా బీజేపీలో చేరిన ఫిరాయింపుదార్ల మెడలో టికెట్ల హారం వేస్తోంది. రణ్‌జిత్‌సింగ్ చౌతాలాకు టికెట్ దక్కనందువల్ల ఆయన మంత్రి పదవికి రాజీనామా చేశారు. నిజానికి గతంలో ఆయనా బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేర్చుకున్న అరగంటలోనే ఇదివరకు టికెట్ ఇచ్చారు. ఇటీవల ఆయనను లోక్‌సభకు పోటీ చేయిస్తే ఓడిపోయారు. అందుకే ఆయనకు ఇప్పుడు టికెట్ ఇవ్వలేదు. ఇప్పటికే 67 మంది అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారు కనక మిగిలిన 23 మందిలో ఎంత మంది ఫిరాయింపుదార్లకు అవకాశం ఇస్తారో చూడాలి. ఇంతకు ముందు నవీన్ జిందాల్ కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరితే ఆయనకు ఏకంగా మంత్రిపదవి దక్కింది. ఆయన తల్లి ఒకప్పుడు కాంగ్రెస్ శాసన సభ్యురాలు. గంపెడాశ పెట్టుకున్న ఆమె బీజేపీలో చేరినా టికెట్ ఇవ్వలేదు. విచిత్రం ఏమిటంటే అత్యాచారం, హత్యకు పాల్పడినందుకు జైలుశిక్ష అనుభవిస్తున్న డేరా సచ్చా బాబా రాం రహీం సింగ్‌కు ఆరుసార్లు పెరోల్ మంజూరు చేసిన జైలర్ సునిల్ సంగ్వాన్‌కు మాత్రం టికెట్ ఇచ్చారు. ఆయన ఇటీవలే జైలర్ ఉద్యోగం మానేసి బీజేపీలో చేరారు. ఏ ఎన్నికలు జరిగినా రాం రహీంకు ఉదారంగా పెరోల్ మంజూరు చేసినందుకు బీజేపీ నాయకత్వం ఆయన మెడలో వరమాల వేసినట్టుంది. కవితా జైన్ అనే నాయకురాలు హర్యానా శాసనసభలో బీజేపీకి నాలుగు స్థానాలే ఉన్నప్పుడూ బీజేపీ జెండా మోశారు. ఈ సారి ఆమెకూ టికెట్ దక్కలేదు. నిజానికి టికెట్ల పంపిణీ కోసం మోదీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమెకు టికెట్ ఖరారైంది. అంతిమ జాబితాలో మాత్రం ఆమె పేరు లేదు. రైతుల ఉద్యమానికి హర్యానా పెట్టింది పేరు. కానీ కిసాన్ మోర్చా అధ్యక్షుడికీ బీజేపీ శూన్య హస్తం చూపడంతో ఆయన ఆ పార్టీకి రాజీనామా చేశారు.

తమది కార్యకర్తల పునాదిపై లేచిన పార్టీ సౌధం అని బీజేపీ పదే పదే చెప్పుకుంటుంది. పోలింగ్ కేంద్ర స్థాయిలోనే కాదు, ఓటర్ల జాబితాలో ఒక పేజీకి బాధ్యులైన కార్యకర్తలు ఉన్నారని బీజేపీ గొప్పగా ప్రచారం చేసుకుంటుంది, కానీ వారికి దక్కుతున్నది ఏమీ లేదు. ప్రస్తుతం హర్యానాలో జన నాయక్ జనతా పార్టీ (జె.జె.పి.) తో కలిసి బీజేపీ అధికారంలో ఉంది. తాను ఏ పార్టీతో పొత్తు పెట్టుకున్నా దాన్ని దివాలా తీయించడం బీజేపీ ప్రత్యేకత. ఆ ఒరవడిలోనే జె.జె.పి. లోని ఏడుగురిని తమ పార్టీలో చేర్చుకుంది. వీరు టికెట్లు ప్రకటించడానికి రెండు రోజుల ముందే పార్టీలో చేరారు. జె.జె.పి. ఇప్పుడు అస్తిత్వం కోసం పోరాడవలసి వస్తోంది. ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ సైనీ ఇదివరకు కర్నాల్ నుంచి గెలిచారు. ఈ సారీ ఆయన అక్కడి నుంచే పోటీ చేస్తానని ఢంకా మీద దెబ్బవేసి మరీ చెప్పారు. కానీ అధినాయకత్వం ఆయనను లాడ్వా నుంచి అభ్యర్థిగా ఖరారు చేసింది. లాడ్వా నియోజక వర్గంలో బీజేపీ కిందటి ఎన్నికలలో ఓడిపోయింది. సైనీ ఓ.బి.సి. వర్గానికి చెందిన వారు. కానీ జాట్లు ఎక్కువగా ఉండే లాడ్వా నుంచి ఆయనను పోటీ చేయించడంలో ఆంతర్యం ఏమిటో తెలియదు. సైనీ ఆరు నెలల ముందే ముఖ్యమంత్రి అయ్యారు. ఆయనకు అవకాశం ఉన్న చోటి నుంచి పోటీ చేయడానికి బీజేపీ అధినాయకత్వం మోకాలు అడ్డింది. కరణ్ దేవ్ కాంబోజ్ ఓ.బి.సి. నాయకుడు. బీజేపీ ఓ.బి.సి. విభాగం అధ్యక్షుడు. అయినా ఆయనకు టికెట్ కేటాయించకపోవడంతో ఆయనా బీజేపీకి రాజీనామా చేశారు. సాధారణంగా ఎన్నికలు జరిగే రాష్ట్రంలో మోదీ ఆసుపోసినట్టు పర్యటిస్తుంటారు. మొన్న లోక్‌సభ ఎన్నికలు జరిగిన తరవాత మోదీ హర్యానాలో కాలేమోపలేదు. హర్యానాలో ఎవరు ముఖ్యమంత్రిగా ఉన్నా ప్రభుత్వ నిర్వహణ మాత్రం ప్రధాన మంత్రి కార్యాలయం నుంచే సాగుతుంది. న్యాయ వ్యవస్థ, కార్యనిర్వాహకవర్గంపై బీజేపీకి పట్టు ఉన్నందువల్ల మొన్నటిదాకా కోల్‌కతా హైకోర్టులో న్యాయమూర్తిగా ఉన్న అభిజిత్ గంగోపాధ్యాయ బీజేపీలోచేరి మొన్నటి ఎన్నికలలో ఎంపీ అయిపోయారు. ఇదంతా చూస్తూ ఉంటే బీజేపీ దిగుమతి చేసుకున్న నాయకులకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నట్టు కనిపిస్తోంది. లోక్‌సభలో బీజేపీ సభ్యులలో ఇతర పార్టీల నుంచి బీజేపీలో చేరినవారు గణనీయమైన సంఖ్యలో ఉన్నారు. తాము వంశ పారంపర్య రాజకీయాలకు వ్యతిరేకమని బీజేపీ టముకు వేసుకుంటూ ఉంటుంది. కానీ ఇప్పుడు ఎంపిక చేసిన 67 మందిలో ఆరుగురు ఆనువంశిక రాజకీయాల కారణంగానే టికెట్ సంపాదించారు. ఫిరాయింపులకు తాము వ్యతిరేకమని బీజేపీ ఎంత గట్టిగా అరిచి చెప్పుకున్నా వారికే ఉదారంగా టికెట్లు కేటాయిస్తోంది. దేశంలోని అత్యంత ధనవంతులైన మహిళల్లో నాలుగో స్థానంలో ఉన్న సావిత్రి జిందాల్‌కూ నిరాశే మిగిలింది. బీజేపీ వల్లించే నీతులు ప్రచారానికే పరిమితం.

ఏమీ సేతురా లింగా... ఏమీ సేతూ...!!

"**కం**డ్రిగ... కండ్రిగ... కండ్రిగ... ముప్పై రూపాయలు బాబూ... అమ్మా... ముప్పై రూపాయలే. బోటు సర్రని ఎల్తుందమ్మా... అటు ఇటు తూలిపోడాలు ఉండవమ్మా. త్వరగా రండమ్మా. ఎళ్లిపోదాం. బోట్లో రెండంటే రెండే ఖాళీలున్నాయమ్మా... "రాజీవ్ నగర్ మధ్యలో నిలబెట్టిన బోటులోంచి మహేష్ అరుస్తున్నాడు. రాజీవ్‌నగర్ సెంటర్‌లో నిలుచున్న వారిలో కొంతమంది సింగ్ నగర్ వెళ్లాలి. మరి కొంతమంది పాయకాపురం వెళ్లాలి. సుందరయ్యనగర్ వెళ్లాల్సిన వారు కూడా ఉన్నారు. అక్కడికి వెళ్లిన తర్వాత బస్టాండ్‌కో, రైల్వే స్టేషన్‌కో మళ్లీ మారాలి. అప్పుడు ఆటో కాని, బస్సు కాని ఎక్కాలి. " ఏం చేస్తాం. తప్పదు. ఈ చెరువులు ఇక్కడి దాకానే ఉన్నాయి. ఆ బుడమేరు కూడా ఆ ఏరియాల వరకూనే పారింది. మరో ఐదారు కిలోమీటర్లు బుడమేరు పొంగితే ఇలా బోటు, పడవ, తర్వాత ఆటో మారే దరిద్రం ఉండకపోను. ఈ బాధలు పడలేకపోతున్నామమ్మా" అని వాళ్లలో వాళ్లే అనుకుంటున్నారు. "నే చెప్తానే ఉన్నాను. ఇంటితో పాటు ఓ పడవో, బోటో కొనుక్కుందామండి అని. నెత్తి, నోరు బాదుకున్నాను. మొండిఘటం వినలేదు. అప్పులో అప్పు. ఈ బోటో, పడవో కొనుక్కుంటే సరిపోను. ఈ బోట్ల వాళ్లతో వేగలేకపోతున్నాం" అని తన పక్కనే ఉన్న కామేశ్వరమ్మ గారితో చంద్రకళ చెబుతోంది. "అవునమ్మా... మీ అన్నయ్య గారు కూడా వినలేదు. మా అపార్ట్‌మెంట్ కట్టిన బిల్డర్ అపార్ట్‌మెంట్‌లో బోటు పెట్టుకోవడానికి పార్కింగ్ కూడా తక్కువకే ఇస్తానన్నాడు. అబ్బే వినలేదు. ఈ మగాళ్లంతా ఇంతే. వాళ్లకి తోచదు. మనం చెబితే వినరు" అంటూ తన

చక్రవాకం
- ముక్కాముల చక్రధర్

అసహనాన్ని వెళ్లగక్కారు కామేశ్వరమ్మ గారు. "అవునండి. ముందు మునుపు అపార్డ్‌మెంట్లతోపాటు కార్లు పెట్టుకునేందుకు ఇంత స్థలం ఇచ్చేవారు. ఆ మాట నేనూ చెప్పాను మీ అన్నయ్య గారికి. మీరన్నట్లు వింటేనా" చంద్రకళ వంత పాడారు. "మా హైడ్రాబ్యాడ్, సికింద్రాబ్యాడ్‌లో కూడా బోట్లు, పడవలతోనే తిరుగుతున్నాం. కారు కంటే సుఖంగా ఉంది ప్రయాణం. మేం ఉండే దుర్గం చెరువు చుట్టూ ఉన్న అపార్ట్‌మెంట్లలో బోట్ లేకపోతే అద్దెకి కూడా ఇవ్వరు టెలుసా" అంటూ తెలిగింగ్లీషులో వాపోయింది వన్నూ. అంటే వనజ అన్నమాట. ఇంట్లో అందరూ వనజని వన్నూ అని పిలుస్తారు. పిల్లలు మాత్రం బన్నూ, పిన్నూ, పెన్నూ అని ఏడిపిస్తారు. అది వేరే సంగతి. "అదేంటమ్మాయి... మీ దగ్గర హైడ్రా అని ఏదో నిబంధన తెచ్చి చెరువుల మీద కట్టిన భవనాలు కూల్చేశారటగా. మా అమ్మాయి చెప్పింది. ఇంకా ఈ బోట్లేమిటీ... ఖర్మ" అన్నారు అక్కడే బోటు కోసం ఎదురుచూస్తున్న ఓ మామ్మగారు. "నిషమే మామ్మగారు. కూల్చేషారు. కానీ, అప్పటి పొలిటీషియన్ల సన్స్ అదే ఏమంటారు" అంటూ నసుగుతోంది వన్నూ... "కొడుకులమ్మా..." చంద్రకళ ఆ సందేహం తీర్చేశారు. "ఆ ఎస్. కొడుకులు. వాళ్ల వెంచర్లు మాత్రం కూల్చలేదు బామ్మ గారు. వాళ్ల వ్యాపారాలు కదా. అందుకని అక్కడ ఇళ్లు కొనుక్కున్న వారికి బోట్లు కొనుక్కునేందుకు రాయితీలు ఇచ్చారు. ఇళ్లు కూల్చలేదు" అని చెప్పింది. "ఇక్కడ ఆ రాయితీలు అవీ లేవు కాని... బోట్లు కొనుక్కుంటామని ఈ బెజవాడ కార్పొరేషన్‌లో దరఖాస్తు చేసుకుంటే వెంటనే ఇల్లు కట్టుకునేందుకు పర్మిషన్ ఇచ్చేస్తున్నారు" అని కూడా చంద్రకళ తన అనుభవాన్ని చెప్పారు.

బెంగళూరులో దక్షిణ భారత రియల్‌ఎస్టేట్ అండ్ బిల్డర్స్ సమాఖ్య సమావేశం జరుగుతోంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తమిళనాడుతో పాటు కేరళ నుంచి కూడా సమాఖ్య ప్రతినిధులు వచ్చారు. ఆ రోజు సమావేశం చాలా అర్జంట్‌గా ఏర్పాటు చేసింది. అందుకే వీలున్నంత మందిని రావాల్సిందిగా ఆహ్వానించారు. సమాఖ్య అధ్యక్షుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన బోటు చెరువేష్. నిర్మాణ రంగంలోనే కాదు... బోట్ల విక్రయాల్లోనూ చాలా అనుభవం ఉంది. అందుకే ఆ పదవి ఇచ్చారు. ఆయన గొంతు సవరించుకుని సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడడం ప్రారంభించారు. "మిత్రులారా... ఇది సింగిల్ ఎజెండా మీటింగ్. మన సభ్యుల్లో కొందరు తెలుగు రాష్ట్రాల్లో బిల్డర్లు ఇస్తున్న అపార్ట్‌మెంట్‌కి బోట్ ఫ్రీ పథకం రద్దు చేయమంటున్నారు. ఇతర రాష్ట్రాల్లో ఇలా చెరువుల మీద ఇళ్లు కట్టడం, ఆ తర్వాత వరదలకు నీరు అపార్ట్‌మెంట్‌లోనికి రావడం, ఒక ఏరియాకి మరో ఏరియాకి బోట్‌లో వెళ్లడం వంటివి లేవట. కేవలం తెలుగు రాష్ట్రాల్లోనే ఇలా ఉంది అంటున్నారు. అక్కడ తమ కస్టమర్లు కూడా భవిష్యత్‌లో బోట్లు అడుగుతారేమోనని వాళ్లు ఆందోళనగా ఉన్నారట. "మేం చెరువులు మీద ఇళ్లు కట్టం. ఈ రాష్ట్రాల్లో పర్మిషన్ ఇవ్వరు" అని మన ఇతర రాష్ట్రాల సోదరులు చెప్పినా వాళ్ల కస్టమర్లు వినడంలేదట. సో. మనం ఉచిత బోట్ల పథకాన్ని రద్దు చేద్దామా...! వద్దా... !ఇదే నేటి సమావేశంలో ఏకైక అజెండా" అని చెప్పి కూర్చున్నాడు. వెంటనే నో... నో... నో... అంటూ అరుపులు వినిపించాయి. అలా అరుస్తున్న వారు ఎవరా అని అందరూ ఆ అరుపులు వినిపించిన వైపు చూసారు. అలా అరిచిన వారంతా... తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన బిల్డర్లు. అధ్యక్షుడు బోటు చెరువేష్ "సైలెంట్... సైలెంట్ అని అరిచినా వాళ్లు "నో" అంటూనే ఉన్నారు. "సరే ఒకళ్లు మాట్లాడండి" అని అవకాశం ఇచ్చారు బోటు చెరువేష్. బోటులా నడుం వొంగిపోయి, టక్ చేసుకుని సన్నగా, పడవ నడిపేందుకు వాడే తెడ్డులా ఉన్న "చెరువుల తల్లి కన్‌స్ట్రక్షన్స్" ఎండీ వొడ్డు వర్ధనరావు లేచి నిలబడి మాట్లాడడం ప్రారంభించారు. "డియర్ ఫ్రెండ్స్. నాది, నా మిత్రులది ఒకటే మాట. ఈ రోజు మన మీటింగ్‌లా వన్ పాయింట్... అదేంటంటే... మేం మానేద్దామన్నా మా కస్టమర్లు ఒప్పుకోరు. చెరువో, కాలువో, నది పాయ మధ్యలోనో, సముద్రపు ఒడ్డునే ఇల్లు కావాలంటున్నారు. మా తెలుగు రాష్ట్రాల్లో ఇంకెక్కడా ఖాళీ స్థలాలు లేవు. మా బిజినెస్‌లు నడవాలంటే చెరువులు పూడ్చేసి ఇళ్లు కట్టాలి. కాలువల మీద నీటి ఛాయలు కూడా కనిపించకుండా విల్లాలు కట్టాలి. పచ్చని పొలాలు, కొబ్బరి తోటలు అడ్డంగా నరికేసి ఆకాశాన్నంటుకునే అపార్ట్‌మెంట్లు నిర్మించాలి. ఆనక ప్రకృతి వైపరీత్యాలువస్తే దాన్ని తట్టుకునేందుకు బోట్లు ఇవ్వాలి. ఇందుకు మా ప్రభుత్వాలు సహకరిస్తాయి. ఇక మా అధికారులంటారా.... వాళ్లు చేతులు తడుపుకునేందునే పుట్టిన మహానుభావులు. మేం మా స్కీంలు ఆపేది లేదు. నమస్తే" అని లేచారు. ఆయన వెనుకే తెలుగు బిల్డర్లు అందరూ వెలిగిపోతున్న నవ్వులతో హర్షధ్వానాలు చేశారు. సరిగ్గా ఆ సమయంలోనే.... టీవీ చానెళ్లలో ఓ బ్రేకింగ్ న్యూస్ వస్తోంది... "తెలుగు రాష్ట్రాల్లో వానలు తగ్గాయి. కొల్లేరు శాంతించింది. బుడమేరు బుద్ధిగా ఉంది. గోదావరి వికట్టాటహాసం కాకుండా పసి పిల్లలా నవ్వుతోంది. "సింగ్‌నగర్‌లో కూలిపోయిన ఇంటి ముందున్న వరద నీళ్లలో ఎనిమిదేళ్ల పాప కూర్చుని ఏదో వెతుక్కుంటోంది. ఆ పాప దగ్గరికి వెళ్లిన వరద బాధితుల సహాయకుడు "తల్లిగా ఏం వెతుకుతున్నావురా" అని అడిగాడు. ఆ పాప " నేను ఇంటి ముందు నిలుచున్నా అంకుల్. నీళ్లలో దూరంగా వెళ్లిపోతున్న నా కోతి బొమ్మను తీసుకురావడానికి మా అమ్మ వెళ్లింది అంకుల్. వాళ్లిద్దరూ ఇంకా రాలేదు. వాళ్ల గురించే ఇక్కడే కూర్చుని వెతుకుతున్నాను" అంది.

తుపాకి తూటాలకు బలి అవుతున్న చదువులు

భరత్ వేదాంతం

నేడు మన ప్రపంచంలో మిలియన్లకొద్దీ పిల్లలు యుద్ధ వాతావరణంలో హింస, ఘర్షణల మధ్య పెరుగుతున్నారు. కుటుంబ వాతావరణంలో ఆనందంగా పెరగవలసిన పిల్లలు బాంబుదాడుల, సైన్యాల తుపాకీ కాల్పుల మధ్య భయంకరమైన వాతావరణంలో ప్రాణభయంతో, తీవ్రమైన మనోవేదనతో, మానసిక ఒత్తిడితో బతకవలసి వస్తున్నది. ప్రాథమిక యుద్ధ నిబంధనలను విస్మరిస్తూ సైన్యాలు తరచుగా పిల్లలపై దాడులు చేస్తున్నాయి లేదా యుద్ధ ఖైదీలుగా మారుస్తున్నాయి. ఈ సమస్యల నుంచి బయటపడడానికి పిల్లల కుటుంబాలు వారి స్వస్థలాలను విడిచి వేరే ప్రాంతాలకు తరలిపోవలసి వస్తున్నది. ఈ పరిస్థితులలో విద్యా సదుపాయాలే కాదు వైద్య సేవలు కూడా పిల్లలకు అందడం బహు కష్టంగా మారింది. దీర్ఘకాలిక యుద్ధాలు, అంతర్గత పోరాటాలు, జాతుల మధ్య నరమేధాలు, ఉగ్రవాదం, మత ఛాందసవాదాలు, వివక్షతలు, అణచివేతలు ఇలా రకరకాల కారణాలతో మన ప్రపంచంలోని చాలా దేశాల పిల్లలు చదువులకు దూరం అవుతున్నారు. దేశాల మధ్య యుద్ధాలు, జాతుల మధ్య పోరాటాలు, నరమేధాలు కొనసాగుతున్న దేశాలలో పిల్లల చదువులు, వారి భవిష్యత్తులు ప్రశ్నార్థకాలుగా మారుతున్నాయి. ఉగ్రవాద సంస్థలు కూడా విద్యాసంస్థలపై దాడులు చేస్తూ - విద్యార్థులను, అధ్యాపకులను హతమారుస్తూ మానవ సమాజంలో తీవ్రమైన భయోత్పాతాన్ని సృష్టిస్తున్నాయి. పిల్లలను బలవంతంగా వారి దళాలలో సభ్యులుగా నియమించుకొని దాడులకు ప్రోత్సహిస్తున్నాయి. ఆడపిల్లలను చదువులకు దూరంగా ఉంచుతూ, అనేక ఆంక్షలు విధిస్తూ మానవ హక్కులను కాలరాస్తున్నాయి.

> దీర్ఘకాలిక యుద్ధాలు, అంతర్గత పోరాటాలు, జాతుల మధ్య నరమేధాలు, ఉగ్రవాదం, మత ఛాందసవాదాలు, వివక్షతలు, అణచివేతలు ఇలా రకరకాల కారణాలతో మన ప్రపంచంలోని చాలా దేశాల పిల్లలు చదువులకు దూరం అవుతున్నారు. దేశాల మధ్య యుద్ధాలు, జాతుల మధ్య పోరాటాలు, నరమేధాలు కొనసాగుతున్న దేశాలలో పిల్లల చదువులు, వారి భవిష్యత్తులు ప్రశ్నార్థకాలుగా మారుతున్నాయి. ఉగ్రవాద సంస్థలు కూడా విద్యాసంస్థలపై దాడులు చేస్తూ విద్యార్థులను, అధ్యాపకులను హతమారుస్తూ మానవ సమాజంలో తీవ్రమైన భయోత్పాతాన్ని సృష్టిస్తున్నాయి. పిల్లలను బలవంతంగా వారి దళాలలో సభ్యులుగా నియమించుకొని దాడులకు ప్రోత్సహిస్తున్నాయి. ఆడపిల్లలను చదువులకు దూరంగా ఉంచుతూ, అనేక ఆంక్షలు విధిస్తూ మానవ హక్కులను కాలరాస్తున్నాయి.

ఆటపాటలు, తల్లిదండ్రుల ప్రేమ తప్ప మరొక ప్రపంచం తెలియని పిల్లల మీదకు యుద్ధోన్మాదులు క్షిపణులు, బాంబులు, తుపాకీ గుళ్లతో దాడులు చేస్తున్నారు. అమాయకులైన పిల్లలను అకారణంగా చంపేస్తున్నారు లేదా వారిని కోలుకోలేని వికలాంగులుగా మారుస్తున్నారు. మరికొందరిని అనాథలుగా మిగులుస్తున్నారు. ఫిరంగి దాడుల మధ్య, తుపాకీ కాల్పుల మధ్య, పిల్లలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని చదువులకు దూరమై - నిరాశా చీకట్లలలో దుర్భర జీవితాన్ని గడుపుతున్నారు. వృత్తి నిపుణులుగా, విజ్ఞానవేత్తలుగా, శాస్త్ర పరిశోధకులుగా, నవీన ఆవిష్కరణలకు ఆద్యులైన సాంకేతిక నిపుణులుగా ప్రపంచాభివృద్ధికి మూలమైన మానవ వనరులుగా రూపొందవలసిన పిల్లలు యుద్ధోన్మాదానికి బలైపోతున్నారు. మానవ హక్కులను భంగపరుస్తూ, ప్రాథమిక హక్కులను కాలరాస్తూ, ఘోరంగా హింసిస్తున్న సాయుధబలగాల పాశవిక దాడుల నుంచి బాలలను కాపాడటం, వారి భవిష్యత్తును సంరక్షించడం - నేటి ఆధునిక ప్రపంచం ముందున్న ముఖ్యమైన సమస్యలలో ఒకటి. ఐక్యరాజ్యసమితి ప్రపంచవ్యాప్తంగా పిల్లలపై, వారి చదువులపై జరుగుతున్న క్రూరమైన దాడులను శాశ్వతంగా నివారించడానికి ప్రయత్నాలు మొదలు పెట్టింది. దాడులు జరుగుతున్న ప్రాంతాలలో పిల్లల చదువులను పునరుద్ధరించడం, పాఠశాలలను, కళాశాలలను దాడుల నుంచి మినహాయించడం తక్షణ అవసరాలుగా ఐక్యరాజ్యసమితి భావించింది. యుద్ధ నియమ నిబంధనలపై, మానవ హక్కులపై, అంతర్జాతీయ ఒప్పందాలపై ప్రపంచ దేశాలకు, సాయుధ దళాలకు సంపూర్ణ అవగాహన కలిగించటం ముఖ్యమని గుర్తించింది. నిరంతరం నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న దాడులపై అంతర్జాతీయ సమాజాన్ని అప్రమత్తం చేయడానికి ఒక వేదికను ఏర్పాటు చేసింది. ఐక్యరాజ్యసమితి 2020 మే 28న జరిగిన సర్వసభ్య సమావేశంలో దాడుల నుంచి చదువును కాపాడే అంతర్జాతీయ దినాన్ని సెప్టెంబర్ 9వ తేదీన ప్రపంచవ్యాప్తంగా నిర్వహించాలని తీర్మానించింది. నేడు ప్రపంచంలో చోటు చేసుకుంటున్న యుద్ధాలు, సాయుధ పోరాటాలు విద్యార్థులపై, విద్యాలయాలపై, ఉపాధ్యాయులపై చేస్తున్న దాడులపై, వాటి పర్యవసానాలపై చర్చించేందుకు, పరిష్కారాలు కనుగొని - అవసరమైన నివారణా చర్యలను ప్రపంచ దేశాలను నిర్దేశించేందుకు ఈ రోజును ఒక వేదికగా సిద్ధం చేసింది. యునెస్కో, యునిసెఫ్ సహ నిర్వాహకులుగా ప్రతి సంవత్సరం ఈ అంతర్జాతీయ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నది. ఈ సమస్యలతో ముడిపడిన వారినందరిని ఒక వేదికపైకి చేర్చి విద్యార్థులపై సాయుధ దాడులను నిర్మూలించే ప్రయత్నం చేస్తున్నది. పిల్లలను, వారి చదువును కాపాడుకోవడం ప్రప్రథమ బాధ్యతగా అంతర్జాతీయ సమాజంలో బహుళ ప్రచారం చేస్తున్నది. దీర్ఘకాలిక యుద్ధాలు, అంతర్గత పోరాటాలు, జాతుల మధ్య నరమేధాల హింస పిల్లల జీవితాలపై ఎంతటి ప్రభావాన్ని చూపిస్తుందో - వారి మాటల్లోనే ఈ ప్రపంచానికి తెలియపరచడానికి యునిసెఫ్ "శాంతి కోసం కవిత" అనే ఒక వెబ్‌సైట్ బాధిత పిల్లల కోసం అభివృద్ధి చేసింది. పిల్లల ఆశలను, మంచి భవిష్యత్తుకై వారు కంటున్న కలలను మానవ సమాజం ముందు ఉంచుతున్నది. భీకర యుద్ధాల మధ్య స్థిరమైన శాంతియుత భవిష్యత్తు కోసం తల్లడిల్లి పోతున్న పిల్లల బాధను ఈ ప్రపంచానికి చూపిస్తున్నది. ఐక్యరాజ్యసమితి 2021, 2022 రెండు సంవత్సరాల కాలంలో 28 దేశాలలో జరిగిన సాయుధ సంఘర్షణలను పరిశీలించి - విద్యార్థులపై, విద్యాసంస్థలపై ఐదు వేలకు పైగా దాడులు జరిగినట్లు పేర్కొంది. ఇలాంటి దాడులు పలస్తీనాలో అత్యధికంగా జరిగినట్లు గుర్తించింది. ఈ దాడుల నివారణకు అంతర్జాతీయంగా మరింత కృషి అవసరమని నిర్ధారించింది. జాతుల మధ్య భీకర పోరాటాలు, సాయుధ ఘర్షణలు, యుద్ధాలు నెలకొన్న భూభాగాలలో పిల్లలు ఘోరమైన హింసకు గురికావలసి వస్తున్నదని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి 2023 వార్షిక నివేదికలో వెల్లడించారు. 2023లో ఐక్యరాజ్యసమితి విభిన్న దేశాలలో 25 సందర్భాలలో జరిగిన యుద్ధాలు, సాయుధ ఘర్షణల ఫలితంగా పిల్లలకు కలిగిన నష్టాల వివరాలను సేకరించింది. యుద్ధ నియమాలను ఉల్లంఘిస్తూ అంతర్జాతీయ ఒప్పందాలకు విరుద్ధంగా, క్రూరంగా దాడులు చేస్తున్నారని 32,990 ఫిర్యాదులు అందాయి. ఐక్యరాజ్యసమితి క్షేత్రస్థాయిలో ఫిర్యాదులను పరిశీలించి 2023లో 3,075 ఉల్లంఘనలు జరిగాయని మిగిలినవి అంతకు పూర్వం జరిగినట్లుగా నిర్ధారించింది. మానవ హక్కులకు తిలోదకాలిచ్చి, యుద్ధ నిబంధనలను గాలికి వదిలి చేసిన దమనకాండకు 22,257 మంది పిల్లలు ప్రభావితమయ్యారని ధ్రువీకరించింది. వివిధ దాడులలో 531 మంది పిల్లలు మరణించగా - 6348 మంది పిల్లలు వికలాంగులుగా మారి క్షోభను అనుభవిస్తున్నారని, మంచాలకే పరిమితమై వారి తల్లిదండ్రులకు దుఃఖాన్ని మిగులుస్తున్నారని ఐక్యరాజ్యసమితి తెలిపింది. 860 పైచిలుకు పిల్లలను వివిధ సాయుధ దళాలు వారి సభ్యులుగా నియమించుకొని, ప్రత్యర్థులపై దాడులకు వినియోగించి వారి జీవితాలను బలి తీసుకుంటున్న నిజం ఐక్యరాజ్యసమితి విచారణలో వెలుగు చూసింది.

2023వ సంవత్సరంలో వివిధ సందర్భాలలో జరిగిన దాడులలో గాయపడి, అనారోగ్యంతో ఉన్న 2400పైగా పిల్లలను ఏ వసతులు లేని ఇరుకైన గదులలో ఖైదీలుగా చేసి - వారికి సరైన ఆహారం, అవసరమైన వైద్యం అందించకుండా అతి దారుణంగా హింసిస్తున్నారని ఐక్యరాజ్యసమితి ధ్రువీకరించింది. ప్రత్యర్థి దళాలతో సంబంధాలు కలిగి ఉన్నారని, విరోధి వర్గాలకు సమాచారం చేరవేస్తున్నారనే అభియోగాలతో పిల్లలను బంధించడం, తీవ్రంగా హింసించడం, హతమార్చడం లాంటి నేరాలకు - సాయుధ దళాలు, ప్రభుత్వ బలగాలు తరచుగా పాల్పడుతున్నాయని ఐక్యరాజ్యసమితి నిర్ధారించింది. సాయుధ దళాలు, ఉగ్రవాదులు, తిరుగుబాటు దళాలే కాదు ప్రభుత్వ బలగాలు కూడా యుద్ధ నిబంధనలను ఘోరంగా ఉల్లంఘిస్తున్నాయి. కొన్ని సాయుధ దళాలు పిల్లలను అపహరించడం, నిర్బంధించడం, ముఖ్యంగా ఆడపిల్లలను లైంగికంగా హింసించటం లాంటి అకృత్యాలకు పాల్పడుతుంటే - మరికొన్ని దళాలు పిల్లలను తమ సభ్యులుగా నియమించుకొని దాడులకు వినియోగిస్తూ వారి జీవితాలను బలి తీసుకుంటున్నాయి. ప్రభుత్వ బలగాలు వారి యుద్ధ వ్యూహాలలో భాగంగా పాఠశాలలపై, వైద్యశాలలపై దాడులు నిర్వహిస్తున్నాయి. జెనీవా ఒప్పందం ప్రకారం పాఠశాలలపై, వైద్యశాలలపై దాడులు చేయటం యుద్ధ నేరమని తెలిసినా - యుద్ధోన్మాదులు ఈ దాడులను పునరావృతం చేస్తున్నారు. యుద్ధాలలో పిల్లలను చంపడం, శారీరకంగా హింసించి - వికలాంగులను చేయడం, సాయుధ దళాలలో లేదా ప్రభుత్వ బలగాలలో సభ్యులుగా నియమించుకోవడం, పిల్లల్ని అపహరించటం, బంధించడం, లైంగికంగా వేధించడం యుద్ధ నియమ నిబంధనలను ఉల్లంఘించటమే కాదు, అంతర్జాతీయ ఒప్పందాల ప్రకారం, మానవతా చట్టాల ప్రకారం నేరాలు. యుద్ధోన్మాదులు ఈ అంశాలను విస్మరిస్తున్నారు. ఇజ్రాయిల్, ఆక్రమిత పలస్తీనా భూభాగం, గాజా, కాంగో సోమాలియా, సుడాన్ మొదలైన దేశాలలో నెలకొన్న యుద్ధాలలో, చెలరేగిన సాయుధ పోరాటాలలో ఎక్కువమంది పిల్లల ప్రాణాలు హరించివేయగా, మరికొంతమంది పిల్లల జీవితాలు ఛిద్రమైపోయాయని ఐక్యరాజ్యసమితి వెల్లడించింది. భేషజాలను తొలగించుకుని, సంకుచిత భావాలను వదిలించుకొని - పరస్పరం అర్థం చేసుకుంటూ, పరస్పరం సహకరించుకునే స్ఫూర్తితో - భావితరాల భవిష్యత్తు కోసం తక్షణమే కాల్పుల విరమణ చేసి, వైరి వర్గాలు శాంతియుత పరిష్కారాలకు సిద్ధం కావాలని ఐక్యరాజ్యసమితి ఆహ్వానిస్తున్నది. నేటి బాలలే ప్రపంచ భవిష్యత్తుగా ఐక్యరాజ్యసమితి భావిస్తూ - వారిని కాపాడుకుంటూ - విద్యావంతులుగా, వివేకవంతులుగా తీర్చిదిద్దటం ప్రపంచ దేశాల కర్తవ్యంగా నిర్దేశిస్తున్నది. మానవ సమాజాన్ని జాగృతం చేసి శాంతియుత ప్రపంచంలో పిల్లల విద్యా వికాసాన్ని సాకారం చేయడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నది. ఈ ప్రయత్నాలు ఫలించాలని ఆశిద్దాం!. ఫిరంగి దాడులతో మూతపడ్డ పాఠశాలలు, తుపాకీ కాల్పులతో మూగబోయిన పిల్లల చదువులు తిరిగి ప్రారంభమై వారి జీవితాల్లో వెలుగులు నిండాలని కోరుకుందాం!.

కొత్త పథకాలు ఎవరికోసం?

డా.జ్ఞాన్ పాఠక్

పంటల కనీసమద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలనికోరుతూ శంభు సరిహద్దుల్లో 9నెలలుగా రైతులు నిర్వహిస్తున్న జాతీయ రహదారి దిగ్బంధనం ఉద్యమాన్ని విస్మరించి నరేంద్ర మోదీ ప్రభుత్వం ఏడు రైతు సంక్షేమ పథకాలు ప్రకటించింది. రైతులకు ఇంతకు ముందు రాత పూర్వకంగా ఇచ్చిన హామీ విస్మరించి కొత్త పథకాలు ప్రకటించడం హాస్యాస్పదంగా లేదూ? రూ.14వేల కోట్లు ఈ కొత్త పథకాలకు ఖర్చు చేయనున్నట్లు పేర్కొన్నారు. పంటలకు తక్కువ ధర ఇస్తున్నారని, మద్దతు ధర పెంచాలని, దానికి చట్టబద్ధత కల్పించాలని దేశవ్యాప్తంగా రైతులు ఆందోళనలు చేస్తున్నారు. రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నప్పటికీ ఈ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదు. రైతుల జీవితాలు బాగుపడాలంటే వారు కోరిన వాటిని అమలు చేయాలి. అందుకు భిన్నంగా అమలవుతాయో లేదో తెలియని పథకాలను మోదీ ప్రభుత్వం ప్రకటించింది. అయితే చట్టాలు, విధానాలు రైతుల సంక్షేమానికి దోహదం చేస్తాయని మోదీ ప్రభుత్వం చెప్తుండగా, ఈ పథకాల వల్ల తమకు ఏమాత్రం ప్రయోజనంలేదని రైతులు కుండబద్దలుకొడుతున్నారు. ప్రభుత్వం ఈ నెల 3న 'అగ్రి సూరే ఫండ్' ను ప్రకటించింది. వ్యాపారాలు పెంపొందించేందుకు, కార్పొరేట్ల కోసం ఈ పథకాలు ఉపయోగపడతాయని రైతులు చెపుతున్నారు. వ్యవసాయ ఆధారిత ఆర్థిక రంగానికే ఇవి ఉపయోగపడతాయని రైతులు అంటున్నారు. ప్రభుత్వం మాత్రం ఈ పథకాలతో రైతుల ఆదాయం పెరుగుతుందని వాదిస్తోంది. ప్రభుత్వ విధానాలన్నీ సంపన్నులకు, కార్పొరేట్లకు ఉపయోగపడుతున్నాయని గత పదేళ్ల మోదీ పాలన నిరూపించింది. వ్యవసాయాన్ని, గ్రామీణాభివృద్ధిని మోదీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోంది. వ్యవసాయరంగానికి పూర్తి స్థాయి మంత్రి కూడా ఉండటంలేదు. ఇప్పుడు శివరాజ్‌సింగ్ చౌహాన్ వ్యవసాయం, రైతుల సంక్షేమం, గ్రామీణాభివృద్ధి శాఖలను చూస్తున్నారు. మోదీ ప్రభుత్వం ప్రధానంగా వాణిజ్యం, కార్పొరేట్లకు లాభాలు తెచ్చిపెట్టే విధానాన్ని అమలుచేస్తున్నారు. అదీ ఆర్థికాభివృద్ధి పేరుతో అమలు చేస్తున్నారు. కార్పొరేట్లు ఎక్కువ పెట్టుబడులు పెడతారని దీనివల్ల ఉద్యోగాలు వస్తాయని చెప్తున్నారు. ఇది ఒట్టి బూటకమని గత పదేళ్లలో నిరూపణ అయింది. అయితే రైతుల, గ్రామీణ పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. రోజురోజుకీ నిరుద్యోగం పెరుగుతోంది. 'అగ్రిసూరే' అనేది స్టార్టప్‌లు, గ్రామీణ పరిశ్రమల కోసం ఏర్పాటు చేసిన వ్యవసాయనిధి అని చెపుతున్నారు. ఇంతవరకు ఏర్పాటు చేసిన స్టార్టప్‌లు అత్యధికం మూలనపడి ఉన్నాయని సర్వేలు తెలిపాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఏ పరిశ్రమలు ఏర్పాటు చేస్తారనే వివరణలేదు. వీటి ద్వారా దేశంలో వ్యవసాయం గొప్ప మార్పుచెందుతోందని ప్రభుత్వం చెప్తోంది. బీజేపీ ప్రభుత్వం అధికారానికి రాకముందు ఎన్నికల ప్రచారంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతుల ఆదాయం రెట్టింపుచేస్తానని నరేంద్ర మోదీ హామీ ఇచ్చారు. చివరకి వ్యవసాయరంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు వివాదాస్పదమైన మూడు



సాగుచట్టాలను పార్లమెంటులో ప్రతిపక్షాలతో నిమిత్తం లేకుండా తీసుకు వచ్చారు. దేశవ్యాప్తంగా ఉన్న వందల రైతుసంఘాల ఆధ్వర్యంలో ఢిల్లీ చుట్టూచేరి సంవత్సరానికిపైగా మహత్తర పోరాటం చేయడం వల్ల మోదీ ఆ చట్టాలను ఉపసంహరించుకున్నారు కానీ రద్దుచేయలేదు. గ్రామీణ పరిశ్రమలు ఆధునిక సాంకేతికత, అధిక రిస్క్‌తో కూడినవని, అయితే గొప్ప ప్రభావం కల్పిస్తాయని ప్రభుత్వం చెప్తోంది. వ్యవసాయ రంగం వృద్ధిచెందడానికి ప్రభుత్వం కేవలం ప్రకటనలు తప్పితే చేసింది ఏమీలేదు. ఆందువల్లనే రైతులు ఈ పథకాలను తిరస్కరిస్తున్నారు. పైగా వ్యవసాయరంగంలో నూతన మార్పులు తెస్తామనీ, గ్రామీణ స్టార్టప్‌లను ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం చెప్తున్న అంశాలు నమ్మదగినవేనా? ఎన్నికలు రాబోయే సందర్భంగా ఇలాంటి పథకాలను ప్రకటించడం కచ్చితంగా నమ్మదగినది కాదు. సాగు చట్టాలను ఉపసంహరించడం కూడా అప్పుడు ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరగనుండటమే కారణం. త్వరలో హర్యానా రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో బీజేపీకి ఓట్లువేయడానికి రైతులు వ్యతిరేకంగా ఉన్నారని, కాంగ్రెస్ గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్న విశ్లేషణలు వస్తున్నాయి. రైతులను ఆకర్షించడం కోసమే మోదీ ఈ కొత్త పథకాలను ప్రకటించారని భావిస్తున్నారు. వ్యవసాయరంగాన్ని అభివృద్ధిచేయాలన్న ఆలోచన ఉంటే బడ్జెట్‌లోనే పథకాలను, నిధుల కేటాయిపును చేర్చవలసింది. ఈ పథకాలకు నిధులను సైతం వివిధ సంస్థల నుంచి సేకరించనున్నారు. గతం నుంచి చేస్తున్న కృషికి ఇవి కొనసాగింపు అని మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ అన్నారు. రైతుల వృద్ధి, ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తుందని మంత్రి అన్నారు. నిజంగా వ్యవసాయరంగం, రైతుల వృద్ధి ఆలోచనుంటే పదేళ్లుగా కాకమ్మకథలు చెప్పడానికి పరిమితమయ్యేవారు కాదు. వ్యవసాయం వృద్ధిని గురించి పదేపదే మాట్లాడే మోదీ మాట్లాడటమేకానీ చేసిందేమీ లేదు. కరోనా సమయంలో సైతం వ్యవసాయ రంగంలో జరిగిన పంటల ఉత్పత్తి ఆర్థిక రంగానికి ఊతాన్నిచ్చింది. ఇప్పుడు ప్రకటించిన రైతు సంక్షేమ పథకాలు కార్పొరేట్లు, వ్యవసాయ ఉత్పత్తుల వాణిజ్యవేత్తలకు ప్రయోజనం కలిగిస్తాయి. స్వామినాథన్ కమిషన్ సిఫారసులును అమలు చేస్తామని మోదీ అనేకసార్లు చెప్పారు. 2024 లోక్‌సభ ఎన్నికలకు కొన్ని నెలలముందు స్వామినాథన్‌కు భారతరత్న ప్రకటించారుగానీ ఆయన సిఫారసులను మాత్రం అమలు చేయడం లేదు. రైతుల సంక్షేమం గురించి మోదీ చెప్పేవి బూటకపు మాటలే. కొత్తగా ప్రకటించిన పథకాలకు రూ.13,966 కోట్లు ఖర్చు చేస్తామని తెలిపారు.అంతకుముందు 12 ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ ప్రాజెక్టులను చేపడతామని ప్రకటించారు. వీటికోసం రూ.28,602 కోట్లు ఖర్చు చేస్తామన్నారు. వీటిలో రెండు ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని నిర్మాణానికి రూ.15వేల కోట్లు ప్రపంచ బ్యాంకు నుంచి అప్పు ఇప్పిస్తామన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి రూ.12వేల కోట్లు కేటాయించారు. ఈ నేపథ్యంలో సిటీ ప్రాజెక్టులకు ఖర్చు చేయగలిగిన స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం లేదు. మోదీ ప్రకటనలలో ఎక్కువ ఇలాంటివే.

సందీప్‌ఘోష్ నివాసంపై ఈడీ దాడులు

కోల్‌కతా: ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోశ్ నివాసంపై ఈడీ శుక్రవారం దాడులు చేసింది. ఘోష్, అతడి సహచరులకు సంబంధించిన వివిధ ప్రదేశాలలో దర్యాప్తు సంస్థ అధికారులు దాడులు చేశారు. ఆస్పత్రి డేటా ఎంట్రీ ఆపరేటర్ ప్రసూన్ ఛటర్జీ ఇంట్లో కూడా సోదాలు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. వైద్యురాలిపై హత్యాచారం అనంతరం కేసులో సీబీఐ దర్యాప్తు చేస్తుండగా... సందీప్‌ఘోష్‌కు సంబంధించిన అనేక అవినీతి, అక్రమ కార్యకలాపాలు బయటపడ్డాయి. ఆసుపత్రి ఆస్తులను కాలేజీ కౌన్సిల్ లేదా స్వాస్థ్ భవన్ అనుమతులు లేకుండానే ఘోష్ లీజుకు ఇచ్చేవాడు. వైద్యశాలకు అవసరమైన పరికరాలు, ఔషధాల సరఫరాదారుల ఎంపికలో బంధుప్రీతి చూపించాడు. కోట్ల రూపాయల విలువైన కొటేషన్ల విషయంలో కుమ్మక్కై అనర్హులకు ఇచ్చాడు. అనాథ శవాలు, వినియోగించిన సిరంజ్‌లు, సెలైన్ బాటిల్స్, రబ్బర్ గ్లౌజులు వంటివి ఆసుపత్రిలో ప్రతీ రెండ్రోజులకు 500-600 కిలోలు పోగయ్యేవి. వాటిని ఇద్దరు బంగ్లాదేశీవాసుల సాయంతో ఘోష్ రీసైక్లింగ్ చేయించేవాడు. దీంతో ఆర్థిక అవకతవకల కేసులో సీబీఐ అతడిని అరెస్టు చేసి, ఎనిమిది రోజుల పాటు పోలీస్ కస్టడీలో ఉంచింది. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అతని సభ్యత్వాన్ని సస్పెండ్ చేసింది.

కాపీ పేస్ట్‌లా అపరాజిత బిల్లు

బెంగాల్ గవర్నర్ విమర్శ

కోల్‌కతా: కోల్‌కతా హత్యాచార ఘటన నేపథ్యంలో పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఇటీవల ఆమోదించిన అపరాజిత బిల్లు... ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, అరుణాచల్‌ప్రదేశ్ ఆమోదించిన బిల్లులకు కాపీ పేస్ట్‌లా ఉందని ఆ రాష్ట్ర గవర్నర్ సీవీ ఆనందబోస్ విమర్శించారు. 'అపరాజిత బిల్లుతో పాటు సాంకేతిక నివేదికను జత చేయడంలో రాష్ట్ర పరిపాలన విఫలమైంది. నియమం ప్రకారం బిల్లుకు ఆమోదం ఇవ్వడంపై నిర్ణయం తీసుకునేముందు రాష్ట్ర ప్రభుత్వం సాంకేతిక నివేదికను పంపడం తప్పనిసరి. కానీ వాటిని పంపలేదు. అందువల్ల బిల్లులను క్లియర్ చేయడంలో ఆలస్యం అవుతోంది. అయినా ప్రభుత్వం తన తప్పులు పక్కనపెట్టి రాజ్‌భవన్‌పై నిందలు వేస్తోంది' అని రాజ్‌భవన్ వెల్లడించింది. పశ్చిమబెంగాల్ శాసనసభ సెప్టెంబర్ 3న రాష్ట్ర అత్యాచార నిరోధక బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించింది. రాష్ట్ర రాజధాని కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటన నేపథ్యంలో 'అపరాజిత ఉమెన్ అండ్ చైల్డ్ బిల్లు(పశ్చిమబెంగాల్ క్రిమినల్ లాస్ అండ్ అమెండ్‌మెంట్) 2024' పేరిట రాష్ట్ర ప్రభుత్వం దీనిని తీసుకువచ్చింది. ఈ ముసాయిదా బిల్లు ప్రకారం అత్యాచారానికి గురైన బాధితులు మరణించినా, కోమాలోకి వెళ్లిపోయినా దోషికి ఉరిశిక్ష విధిస్తారు. అత్యాచారానికి పాల్పడిన దోషులకు పెరోల్ లేని జీవితఖైదు విధిస్తారు.

రూ.33 కోట్లు స్వాహా చేసిన స్విగ్గీ మాజీ ఉద్యోగి

ఇంటర్నెట్ డెస్క్: ప్రముఖ ఫుడ్ డెలివరీ యాప్ స్విగ్గీ మాజీ ఉద్యోగి సంస్థకు చెందిన రూ.33 కోట్లు దారి మళ్లించాడు. దీంతో కంపెనీ అతడిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. స్విగ్గీ 2023-24 వార్షిక నివేదికను సంస్థ ఉన్నతాధికారులు పరిశీలిస్తున్న సమయంలో ఓ అనుబంధ సంస్థకు చెందిన మాజీ ఉద్యోగి కంపెనీ నుంచి రూ.33 కోట్లు దారి మళ్లించినట్లుగా గుర్తించారు. ఈ విషయంపై దర్యాప్తు చేయడానికి కొందరు సభ్యులతో కూడిన బృందాన్ని సంస్థ నియమించింది. పెద్ద మొత్తంలో డబ్బు దారి మళ్లించినందుకుగాను మాజీ ఉద్యోగిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా ఈ ఘటనపై ఇప్పటివరకు స్విగ్గీ ఎటువంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు.

'ఇండియా' కొత్త చరిత్ర లిఖిస్తుంది

హర్యానా ఎన్నికలపై అఖిలేశ్ యాదవ్

లక్నో: హర్యానా ఎన్నికల్లో ఇండియా ఐక్య సంఘటన ఐక్యత ఒక కొత్త చరిత్రను లిఖిస్తుందని సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ శుక్రవారం అన్నారు. బీజేపీ 'వంకర, స్వార్థ రాజకీయాలను' ఓడించడానికి, తమకు తాము ఎదగడానికి ఇదే సమయమని నొక్కి చెప్పారు. హర్యానాలో బీజేపీకి చెందిన 'ప్రతికూల, మతపరమైన, విభజన రాజకీయాలను' ఏ 'ఇండియా' కూటమి సభ్యుడు ఉత్తమంగా ఓడించగలరో వారికే తమ పార్టీ మద్దతు ఇస్తుందని యాదవ్ చెప్పారు. హర్యానా అసెంబ్లీ ఎన్నికల కోసం కాంగ్రెస్, ఆప్ మధ్య సీట్ల పంపకాల చర్చల మధ్య రెండు వైపుల నుంచి గట్టి బేరసారాల నడుమ ఆయన ప్రకటన వచ్చింది. 'ఎక్స్' పోస్ట్‌లో, యాదవ్... రాజకీయ అవకాశాలను అన్వేషించడానికి ఎస్పీ లేదా ఇండియా ఐక్య సంఘటనలోని ఇతర పార్టీలకు ఇది సమయం కాదని, 'త్యాగం, నిస్వార్థం'కు సమయం అని అన్నారు. ప్రజాసంక్షేమ మార్గంలో స్వార్థానికి తావు లేదని ఆయన పేర్కొన్నారు. 'వంకర, స్వార్థపరులు' చరిత్రలో తమ పేరును ఎన్నటికీ నిలబెట్టుకోలేరు. అలాంటి రాజకీయాలను ఓడించేందుకు మనమే పైకి ఎదగడానికి ఈ క్షణం ఒక చారిత్రాత్మక అవకాశం. హర్యానా ప్రయోజనాల కోసం ప్రతి త్యాగానికీ విశాల హృదయంతో మేము సిద్ధంగా ఉన్నాం' అని హిందీలో పేర్కొన్నారు. హర్యానా అసెంబ్లీ ఎన్నికలలో ఇండియా ఐక్య సంఘటన విజయంపై విశ్వాసం వ్యక్తం చేస్తూ ఎస్పీ అధ్యక్షుడు ఇలా పేర్కొన్నారు. 'మేము ఇంతకు ముందు చాలాసార్లు చెప్పాం. దీనిని మళ్లీ చెబుతాం. భవిష్యత్‌లో అలాగే కొనసాగుతాం. ఇది సీట్ల గురించి కాదు. ఇది విజయానికి సంబంధించినది' అని తెలిపారు. 'ఇది కొన్ని స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టడం గురించి కాదు. ప్రజల బాధలను అర్థం చేసుకోవడం. బీజేపీ అవినీతి, తారుమారు రాజకీయాల నుంచి వారిని విముక్తి చేయడం. ఇది హర్యానాకు నిజమైన అభివృద్ధి, దాని ప్రజల సంక్షేమం గురించి. గత 10 సంవత్సరాలుగా బీజేపీ హర్యానా అభివృద్ధిని రెండు దశాబ్దాలు వెనక్కు నెట్టింది' అని అన్నారు. హర్యానాలోని 90 అసెంబ్లీ స్థానాలకు అక్టోబరు 5న పోలింగ్, అక్టోబరు 8న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో, బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరించింది. ఎన్నికల తర్వాత జననాయక్ జనతా పార్టీతో పొత్తు పెట్టుకుని సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అయితే లోక్‌సభ ఎన్నికలకు ముందు ఈ ఏడాది ప్రారంభంలో బీజేపీ-జేజేపీ పొత్తు తెగిపోయింది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో హర్యానాలోని 10 స్థానాలకు గానూ బీజేపీ, కాంగ్రెస్ చెరో ఐదు స్థానాలను గెలుచుకున్నాయి.

మణిపూర్‌లో డ్రోన్ దాడులపై వెల్లువెత్తిన నిరసన

మానవహారాలతో రోడ్డెక్కిన వేలాదిమంది జనం

ఇంఫాల్: మణిపూర్‌లో ఇటీవల జరిగిన డ్రోన్, తుపాకీ దాడులకు వ్యతిరేకంగా శుక్రవారం వేల సంఖ్యలో ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసన తెలిపారు. ఇంఫాల్ లోయలోని ఐదు జిల్లాల్లో జరిగిన ర్యాలీల్లో మానవ హారాలుగా ఏర్పడి నిరసన తెలిపారు. మణిపూర్ ప్రాదేశిక సమగ్రతను కాపాడాలని డిమాండ్ చేశారు. మణిపూర్ సమగ్రతపై సమన్వయ కమిటీ (సీఓసీఓఎంఐ) నిర్వహించిన ర్యాలీలో పాఠశాల, కళాశాల విద్యార్థులు, స్థానిక మహిళలు పాల్గొన్నారు. నిరసనకారులు దాడులను ఖండించారు. దాడుల పట్ల ప్రభుత్వ ఉదాశీనతను తప్పుబట్టారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తౌబాల్ జిల్లాలోని తౌబల్ బజార్, లిలాంగ్ చాజింగ్, సెక్మాయి, క్వాకీథెల్, సింగ్జామీలో రోడ్డు పక్కన చేయిచేయి కలిపి బారులు తీరారు. ఇంఫాల్ పశ్చిమ జిల్లాలో కౌత్రుక్, సెంజామ్ చిరాంగ్‌లలో ఇటీవల జరిగిన డ్రోన్, తుపాకీ దాడులను ఖండిస్తూ నినాదాలు చేశారు. ఈ దాడుల్లో ఇద్దరు మృతి చెందగా... అనేక మంది గాయపడ్డారు. రాష్ట్రంలో కొనసాగుతున్న జాతుల సంఘర్షణపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై నిరసనకారులు తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. 'డ్రోన్ బాంబు దాడి తీవ్రవాద చర్య', 'కుకీ ఉగ్రవాదులపై చర్యలు తీసుకోండి' అని రాసి ఉన్న ప్లకార్డులు ప్రదర్శించారు. ఇంఫాల్ తూర్పు జిల్లాలోని ఖురాయ్‌కు చెందిన యువ నాయకుడు పి హీరోజిత్ సింగ్ విలేకరులతో మాట్లాడుతూ... డ్రోన్, తుపాకీ దాడులు స్థానిక గ్రామస్తులను లక్ష్యంగా చేసుకుని జరిగాయన్నారు. కేంద్ర ప్రభుత్వం తీవ్ర చర్య తీసుకోవాలని పిలుపునిచ్చారు. నిరసనల సందర్భంగా, ప్రధాన మార్కెట్లు మూతబడగా... వాహనాలు ఎక్కడివక్కడ రోడ్లపై నిలిచిపోయాయి.

జల వనరుల్ని సంరక్షించాలి: మోదీ

సూరత్: నీటిని పొదుపు చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ప్రపంచంలోని మంచినీటి వనరులలో భారతదేశంలో కేవలం నాలుగు శాతం మాత్రమే ఉన్నాయని, దానిని సంరక్షించడానికి ప్రజలు 'తగ్గించు, పునర్వినియోగం' మంత్రాన్ని పాటించాలని సూచించారు. నీరు, పర్యావరణ పరిరక్షణ భారతదేశ సాంస్కృతిక స్పృహలో ఒక భాగమని కూడా ప్రధాని పేర్కొన్నారు. గుజరాత్‌లోని సూరత్‌లో నీటి సంరక్షణలో సమాజ ప్రమేయాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో చేపట్టిన 'జల్ సంచయ్ జన్ భగీదారి' కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ...

నీటిని పొదుపు చేసేందుకు వినూత్న పద్ధతులను, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా అవలంబించాల్సిన అవసరం ఉందన్నారు. భారతదేశంలో 80 శాతం నీరు సాగు అవసరాల కోసం ఉపయోగిస్తున్నందున బిందు సేద్యం వంటి స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించాలని మోదీ సూచించారు. 'నీరు, పర్యావరణ పరిరక్షణ మనకు కొత్త కాదు. ఇది భారతదేశ సాంస్కృతిక చైతన్యంలో ఒక భాగం. మన సంస్కృతిలో నీటిని దేవతగా, నదులను దేవతగా భావిస్తారు. నర్మద, గంగా, గోదావరి, కావేరి మన మాతృమూర్తులు. మన పూర్వీకులకు కూడా నీటి సంరక్షణ ప్రాముఖ్యత తెలుసు' అని అన్నారు. ప్రపంచంలోని మంచినీటి వనరులలో భారత్‌లో కేవలం నాలుగు శాతం మాత్రమే ఉన్నాయని, దేశంలోని అనేక ప్రాంతాలు నీటి సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని మోదీ అన్నారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా పనిచేసిన రోజులను గుర్తుచేసుకున్న మోదీ... సొంత రాష్ట్రంలోని గత అనుభవాలు దేశంలో నీటి సంక్షోభాన్ని పరిష్కరించగలననే విశ్వాసాన్ని ఇచ్చాయని అన్నారు. నీటి సంరక్షణలో కేవలం విధానాలే కాదు, ప్రజల భాగస్వామ్యం, సామాజిక నిబద్ధత కూడా కీలక పాత్ర పోషిస్తాయని ఆయన స్పష్టం చేశారు. గ్రామీణ భారతదేశంలోని దాదాపు 15 కోట్ల ఇళ్లకు 'జల్ జీవన్ మిషన్' 'హర్ ఘర్ జల్' పథకం కింద పైపుల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు మోదీ చెప్పుకొచ్చారు. జల్ జీవన్ మిషన్ కింద దేశంలోని దాదాపు 75 శాతం కుటుంబాలకు ఇప్పుడు కుళాయి నీరు అందుతున్నదన్నారు.

సెబీ చైర్‌పర్సన్‌పై చర్యలేవి?

ప్రధాని మోదీని ప్రశ్నించిన కాంగ్రెస్

న్యూదిల్లీ: సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డు (సెబీ) చైర్‌పర్సన్ మాధవీ పురి బుచ్‌పై కాంగ్రెస్ మరోసారి సంచలన ఆరోపణలు చేసింది. ముంబైలో మాధవికి చెందిన ఓ ప్రాపర్టీని సెబీ దర్యాప్తు చేస్తున్న ఓ సంస్థకు అద్దెకి ఇచ్చినట్లు పేర్కొంది. దాన్నుంచి ఆమె ఆదాయం పొందుతున్నట్లు ఆరోపించింది. ఇది అవినీతికి సంబంధించిన వ్యవహారమని దుయ్యబట్టింది. దీనిపై ప్రధాని మోదీ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించింది. 'ఇది కేవలం సొంత ప్రయోజనాలకు సంబంధించిన అంశం కాదు. అవినీతికి సంబంధించిన కేసు. సెబీ సభ్యురాలిగా ఉన్న మాధవి... ముంబైలోని ఓ ప్రాపర్టీని 2018-19లో క్యారల్ ఇన్ఫో సర్వీసెస్ అనే సంస్థ అద్దెకు ఇచ్చారు. ఇన్‌సైడర్ ట్రేడింగ్ సహా అనేక కేసుల్లో సెబీ దర్యాప్తు చేస్తున్న ఓ కంపెనీకి క్యారల్ ఇన్ఫో అనుబంధ సంస్థగా ఉంది. ఆ రెండు కంపెనీల ప్రమోటర్లు ఒక్కరే. 2018-19 నుంచి 2023-24 వరకు అద్దె రూపంలో మాధవి మొత్తం రూ.2.16 కోట్లు పొందారు' అని మాధవీ పురి బుచ్‌పై కాంగ్రెస్ నేత పవన్‌ఖేడా ఆరోపణలు చేశారు. సెబీకి సమగ్రత, జవాబుదారీతనం పతనమైందనడానికి ఇంతకంటే ఏం ఆధారాలు కావాలని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై ప్రధాని మోదీ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. 2017 నుంచి 2021 వరకు సెబీ సభ్యురాలిగా ఉన్న మాధవి... 2022 మార్చి 2న సెబీ చైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు. 2017లో ఆమె సెబీలో చేరినప్పటినుంచి, ఇప్పటివరకు ఐసీఐసీఐ బ్యాంకు అధికారి హోదాలో జీతభత్యాలు అందుకున్నారని కాంగ్రెస్ తెలిపింది. సెబీ సభ్యురాలిగా ఉన్నప్పుడు ఐసీఐసీఐ బ్యాంకుపై వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరుపుతూనే... అదే బ్యాంకు నుంచి ఆదాయం పొందారన్న విషయం ప్రధాని మోదీకి తెలుసా అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే ప్రశ్నించారు. అయితే 2013 అక్టోబరు 31న మాధవి పదవీవిరమణ చేసిన తర్వాత నుంచి ఆమెకు పదవీవిరమణ ప్రయోజనాలు మినహా ఎటువంటి వేతన చెల్లింపులు చేయలేదని ఐసీఐసీఐ బ్యాంక్ వివరణ ఇచ్చింది.

తొలిసారి అసెంబ్లీ బరిలో మహిళా కశ్మీరీ పండిత్

న్యూదిల్లీ: జమ్మూకశ్మీర్‌లో దాదాపు పదేళ్ల తర్వాత అసెంబ్లీకి ఎన్నికలు జరుగుతున్నాయి. మరో పది రోజుల్లో మొదటి దశ పోలింగ్ జరగనుండగా ప్రధాన పార్టీలు ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. ఈ క్రమంలో దాదాపు మూడు దశాబ్దాల తర్వాత తొలిసారి మహిళా కాశ్మీరీ పండిట్‌లు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనున్నారు. జమ్మూకశ్మీర్‌లో సర్పంచ్‌గా పనిచేసిన డైసీ రైనా అనే మహిళా కాశ్మీరీ పండిత్ ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ఎన్డీయూ కూటమిలో బీజేపీ మిత్రపక్షంగా ఉన్న రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అథవాలే) తరుపున పుల్వామాలోని రాజ్‌పోరా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆమె బరిలోకి దిగుతున్నారు. జమ్మూకశ్మీర్‌లో తొమ్మిది మంది మహిళలు పోటీ చేస్తుండగా అందులో రైనా ఒకరు. ఆమె మాట్లాడుతూ.. స్థానిక యువత తమ గొంతుకగా నిలవాలని కోరుకున్నందున తాను పోటీ చేయాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. 'ఇక్కడి యువకులు నన్ను పోటీ చేయమని బలవంతం చేశారు. వారి వాయిస్ జమ్మూకశ్మీర్ అసెంబ్లీకి చేరేలా చూడాలని నన్ను అడిగారు. నేను ఇక్కడ సర్పంచ్‌గా పని చేస్తున్నాను. ఇక్కడి యువకులను తరుచుగా కలుస్తుంటాను. వారి సమస్యలను విని అర్థం చేసుకున్నాను. ఇక్కడి యువత ఏం తప్పు చేయనప్పటికీ బాధ పడుతున్నారు. 1990లో జమ్మూ కాశ్మీర్‌లో జన్మించిన యువకులు కేవలం బుల్లెట్లను మాత్రమే చూశారు' అని పేర్కొన్నారు. కాగా రైనా న్యూదిల్లీలోని ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేసి, 2020లో సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలని ఎప్పుడు నిర్ణయించుకున్నారని రైనాను ప్రశ్నించగా... తాను అసలు ఎన్నికల్లో పోటీ చేయాలని కూడా అనుకోలేదని చెప్పారు. అయితే పుల్వామాను చక్కదిద్దగలనని చెప్పి ఒక్కరోజు ముఖ్యమంత్రి కావాలని యువకులు తనను కోరినట్లు ఆమె పేర్కొన్నారు. ఇదిలా ఉండగా శ్రీనగర్‌లోని హబ్బా కదల్ అసెంబ్లీ నియోజకవర్గం కాశ్మీరీ పండింట్‌ల విషయంలో ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారింది. రెండో దశలో భాగంగా ఈ నెల 25న మరో 26 నియోజకవర్గాలతో పాటు హబ్బా కదల్‌కు ఎన్నికలు జరగనున్నాయి. అయితే అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి మొత్తం 14 మంది నామినేషన్ దాఖలు చేయగా... వారిలో ఆరుగురు కాశ్మీరీ పండింట్‌లు ఉన్నారు. మొత్తం 90 స్థానాలున్న జమ్మూకశ్మీర్ అసెంబ్లీ కి ఎన్నికల కమిషన్ ఇప్పటికే షెడ్యూల్ విడుదల చేసింది. మూడు దశల్లో ఎన్నికలు జరుగుతాయి. మొదటి దశ ఈ నెల 18న, మిగతా రెండు రౌండ్లు 25, అక్టోబర్ ఒకటిన జరగనున్నాయి. అక్టోబర్ ఎనిమిదో తేదీన ఫలితాలు వెలువడనున్నాయి. ఆర్టికల్ 370 రద్దు అనంతరం జరుగుతున్న తొలి అసెంబ్లీ ఎన్నికలు ఇవి. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్రంలో ఓటరు ఏ పార్టీకి పట్టం కట్టనున్నాడనే అంశంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

స్వతంత్ర అభ్యర్థిగా సావిత్రీ జిందాల్

చండీగఢ్: భారత సంపన్న మహిళ సావిత్రీ జిందాల్ హర్యానా ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. కొన్నాళ్లక్రితం వరకు ఆమె బీజేపీ టికెట్‌తో హిస్సార్ నుంచి బరిలోకి దిగుతారని భావించారు. కానీ, ఇటీవలే కమలం పార్టీ 67 మంది అభ్యర్థులతో ఓ జాబితాను విడుదల చేసింది. అందులో హిస్సార్ నియోజకవర్గం ఉన్నా, సావిత్రికి టికెట్ ఇవ్వలేదు. ఆ అసెంబ్లీ నియోజకవర్గ టికెట్‌ను రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి కమల్‌గుప్తాకు కేటాయించింది. ఆయన గతంలో రెండుసార్లుగా అక్కడినుంచి పోటీ చేసి విజయం సాధించారు. బీజేపీ ప్రకటన తర్వాత ఆమె జిందాల్ చౌక్‌కు చేరుకొగా... భారీ సంఖ్యలో అభిమానులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆమె విలేకర్లతో మాట్లాడుతూ... 'హిస్సార్ నా ఇల్లు. అక్కడి ప్రజల గోడును వినాల్సిన బాధ్యత నాపై ఉంది' అని పేర్కొన్నారు. తాను బీజేపీలో చేరలేదని... కాంగ్రెస్‌ను వీడలేదని నర్మగర్భంగా వ్యాఖ్యానించారు. తన కుమారుడు, కురుక్షేత్ర ఎంపీ నవీన్ జిందాల్ అధ్వర్యంలో కురుక్షేత్రలో జరుగుతున్న బీజేపీ సభ్యత్వ నమోదులో తాను పాల్గొనలేదని వెల్లడించారు. బీజేపీ అధిష్ఠానం తీసుకొన్న నిర్ణయంతో ఆగ్రహంగా లేనని పేర్కొన్నారు. ఇదే తన చివరి ఎన్నికలని ఆమె ప్రకటించారు. బీజేపీ హయాంలో చాలా పనులు చేసినా... ఇంకొన్ని మిగిలే ఉన్నాయని చెప్పారు. ఈసారి విజయం సాధిస్తే... అసంపూర్తిగా ఉన్న పనులు మొత్తం పూర్తిచేస్తానని హామీ ఇచ్చారు. బీజేపీ టికెట్ ఇచ్చిన కమల్‌గుప్తాకు స్థానికంగా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా జిల్లా కార్యదర్శి తరుణ్ జైన్ నిరసన వ్యక్తంచేశారు. తన ఇంట్లో గురువారం సమావేశం నిర్వహించి పార్టీకి రాజీనామా చేశారు. ఈసారి నియోజకవర్గ ప్రజలు ఆయన డిపాజిట్ గల్లంతు చేస్తారని పేర్కొన్నారు. సావిత్రి జిందాల్ ఆస్తి మొత్తం ఆగస్టు 21 నాటికి 39.5 బిలియన్ డాలర్లు. వీరి కుటుంబానికి పలు రంగాల్లో భారీ పరిశ్రమలు ఉన్నాయి.

కాంగ్రెస్ గూటికి ఆప్ ఎమ్మెల్యే గౌతమ్

దళితులు మైనార్టీలపై వివక్ష చూపుతున్నారని ఆరోపణ

న్యూదిల్లీ : అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని పార్టీలో దళిత, మైనార్టీ నాయకులపై వివక్ష నెలకొందని ఆరోపిస్తూ దిల్లీ మాజీ మంత్రి రాజేంద్ర పాల్ గౌతమ్ శుక్రవారం ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఆప్ నుంచి తన రాజీనామాను ప్రకటించిన కొద్ది నిమిషాలకే గౌతమ్ కాంగ్రెస్‌లో చేరారు. రిజర్వుడు సీమాపురి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆప్ ఎమ్మెల్యే పదవికి కూడా ఆయన రాజీనామా చేశారు. ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్‌ను ఉద్దేశించి రాసిన రాజీనామా లేఖలో గౌతమ్ పార్టీపై విమర్శలు చేశారు. 'కుల గణన, రిజర్వేషన్ల పరిమితిని 50 శాతానికి పైగా పెంచడం, జనాభా ఆధారిత 'బహుజన సమాజ్' భాగస్వామ్యాన్ని నిర్ధారించడం, లౌకికవాద పరిరక్షణ వంటి అంశాలను పెంచడంలో పార్టీ 'చాలా బలహీనంగా, నిస్సహాయంగా' కనిపించిందని ఆరోపించారు. ఆప్‌లో సామాజిక న్యాయం, సామాజిక సమానత్వానికి సంబంధించిన పనుల గురించి ఊహించడం అసాధ్యం అని నేను బరువెక్కిన హృదయంతో చెప్పాలి' అని తెలిపారు. బాబాసాహెబ్ అంబేద్కర్ సైనికుడిగా, ఆప్‌లో ఉన్నప్పుడు సామాజిక న్యాయం అనే తన జీవితంలో మొదటి, చివరి లక్ష్యాన్ని సాధించలేనని కొంతకాలంగా భావిస్తున్నానని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీలకు ఆప్ ప్రత్యేక ప్రాతినిధ్యం ఇవ్వలేదని దళిత వర్గానికి చెందిన గౌతమ్ అన్నారు. 'పార్టీ (ఆప్) అగ్రవర్ణ ఎమ్మెల్యేలు లేదా మంత్రులు ఏవైనా ఆరోపణలు ఎదుర్కొన్నప్పుడు వారికి మద్దతు ఇస్తుంది. కానీ అవి తప్పుడు ఆరోపణలు అయినప్పటికీ ముస్లిం లేదా దళితులను వెంటనే వదిలివేస్తుంది. పార్టీ అంతర్గతంగా ముస్లిం, దళితులను పక్కనపెడుతుంది. దాని ప్రవర్తనను మార్చుకోవడం బాధాకరమైన విషయం' అని అన్నారు. గౌతమ్ నవంబరు 2014లో ఆప్‌లో చేరారు. కేజ్రీవాల్ ప్రభుత్వంలో సాంఘిక సంక్షేమంతో సహా వివిధ శాఖలను కలిగి ఉన్న మంత్రిగా మారారు. అక్టోబరు 2022లో హిందూ దేవతలపై చేసిన ఆరోపణలపై రాజకీయ తుఫాను మధ్య ఆయన మంత్రి పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది.

కాగా, ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, ఆ పార్టీ దిల్లీ అధ్యక్షుడు దేవేందర్ యాదవ్, కాంగ్రెస్ మీడియా ప్రచార విభాగం అధినేత పవన్ ఖేరా సమక్షంలో గౌతమ్ కాంగ్రెస్‌లో చేరారు.

నా కూతురి కల చెదిరింది

కన్నీరుపెట్టిస్తోన్న కోల్‌కతా వైద్యురాలి తల్లి పోస్టు

కోల్‌కతా: 'మమ్మల్ని ఒంటరిని చేసి, మధ్యలో వదిలేసివెళ్లిపోయిన వైద్యురాలి తల్లిని నేను. ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా నా కుమార్తె తరఫున ఉపాధ్యాయులందరికీ సెల్యూట్ చేస్తున్నాను. చిన్నప్పటినుంచి నా బిడ్డది ఒకటే కల. డాక్టర్ కావాలని ఆరాటపడేది. తనలో ఆ స్ఫూర్తిని నింపింది మీరే. మీలాంటి గొప్ప టీచర్లు తనకు తారసపడటం వల్లే... తన కలను నెరవేర్చుకోగలిగింది' అని కోల్‌కతా వైద్యురాలి తల్లి ఆవేదనాభరితంగా చెప్పారు. టీచర్స్ డే సందర్భంగా ఉపాధ్యాయులను ఉద్దేశించి ఆమె ఓ లేఖ రాసింది. అలాగే ఓ సందర్భంలో తన కుమార్తెతో జరిపిన సంభాషణను పంచుకున్నారు. 'అమ్మా నాకు డబ్బు వద్దు. నా పేరు ముందు చాలా డిగ్రీలుండాలి. సాధ్యమైనంత ఎక్కువమంది రోగులకు వైద్యం అందించాలి అంటూ నాతో చెప్పేది. ఆ ఘోరం జరిగిన రోజు కూడా ఇంటి నుంచి ఆసుపత్రికి వెళ్లి ఎంతోమంది రోగులకు సహాయం చేసింది. కానీ, ఆమె విధుల్లో ఉండగానే హత్య చేశారు. ఆమె కలలను గొంతునొక్కి చిదిమేశారు. నా బిడ్డకు న్యాయం కావాలి' అని ఆ తల్లి చేసిన అభ్యర్థనతో ప్రతీ హృదయం చెమ్మగిల్లుతోంది.

శాంతికి భంగం కలగకూడదు: రాజ్‌నాథ్

లక్నో: యుద్ధానికి సాయుధ బలగాలు సిద్ధంగా ఉండాలంటూ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వివరణ ఇచ్చారు. దేశ శాంతికి ఎట్టి పరిస్థితుల్లోనూ భంగం కలగరాదనే ఉద్దేశంతోనే తాను ఆ ప్రకటన చేసినట్టు చెప్పారు. మీడియాతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ, భారతదేశ సందేశం 'వసుధైక కుటుబం' అని, భారతదేశం ఎప్పుడూ శాంతినే కోరుకుంటుందని అన్నారు. అయితే నేటి భౌగోళిక రాజకీయ పరిస్థితుల రీత్యా దేశంలోనూ, ప్రపంచంలోనూ శాంతిని నెలకొల్పేందుకు భారతదేశం ఎల్లప్పుడూ యుద్ధానికి సన్నద్ధంగా ఉండాల్సిన అవసరం ఉందని చెప్పారు. 'ప్రపంచ దేశాల్లో వసుధైక కుటుంబం సందేశాన్ని ఇచ్చిన ఏకైక దేశం భారత్ ఒక్కటే. ఇండియా ఎప్పుడూ శాంతిని కోరుకుంటుంది. శాంతి సందేశాన్ని చాటుతుంది. అయితే నేడు మారుతున్న భౌగోళిక రాజకీయ పరిస్థితుల్లో దేశంలో శాంతిని నెలకొల్పాలంటే యుద్ధానికి సన్నద్ధంగా ఉండాలని సాయుధ బలగాలకు సూచించాను. అలా ఉన్నప్పుడే ఇండియా శాంతికి ఎట్టి పరిస్థితుల్లోనూ భంగం కలగదు' అని రాజ్‌నాథ్ వివరించారు. శాంతి, స్థిరత్వానికి ఉత్తర సరిహద్దు, పొరుగుదేశాల్లో నెలకొన్న పరిస్థితులు సవాలు విసురుతున్నందున వీటిలో దృష్టిలో ఉంచుకుని సైన్యాధికారులు విస్తృతమైన, లోతైన విశ్లేషణ చేయాల్సి ఉందని రాజ్‌నాథ్ సింగ్ ఇటీవల లక్నోలో జరిగిన త్రివిధ దళాల కమాండర్ల సంయుక్త సమావేశంలో దిశానిర్దేశం చేశారు. రష్యా-ఉక్రెయిన్, గాజా సంక్షోభం, బంగ్లాదేశ్ పరిస్థితులను విశ్లేషించడం ద్వారా భవిష్యత్తుల్లో ఎదురయ్యే సవాళ్లను అంచనా వేయగలుగుతుతామని, ఊహించని పరిణామాలను దీటుగా ఎదుర్కోగలుగుతామని అన్నారు.

ఎవరు దేవుళ్లో ప్రజలే నిర్ణయిస్తారు: భగవత్



పూణె: తనకు తాను దేవుడి అంశగా చెప్పుకున్న ప్రధాని నరేంద్రమోదీపై ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భగవత్ పరోక్ష విమర్శలు చేశారు. దేవుళ్లమని మనకు మనం స్వయంగా ప్రకటించుకోకూడదని, ఆ విషయాన్ని ప్రజలే నిర్ణయిస్తారని మోహన్ భగవత్ అన్నారు. 1971లో కీలక నేత శంకర్ దినకర్ కానే (భయ్యాజీ) మణిపూర్‌లో చేసిన సేవలను స్మరించుకొంటూ పూణెలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కొంతమంది మెరుపులా మెరవాలని కోరుకుంటారని, కానీ, పిడుగు పడిన తర్వాత మరింత చీకటిగా మారుతుందని వారు గుర్తించరన్నారు. కార్యకర్తలు ఒక దీపంలా... అవసరమైనప్పుడు నిలకడగా వెలుగునివ్వాలన్నారు. శంకర్ దినకర్ 1971లో మణిపూర్‌లో చిన్నారుల విద్య కోసం తీవ్రంగా కృషి చేశారని చెప్పారు. అక్కడినుంచి విద్యార్థులను మహారాష్ట్రకు తీసుకొచ్చి వారికి బస ఏర్పాటుచేసి బోధనా సౌకర్యాలు కల్పించారన్నారు. మణిపూర్ సంక్షోభంపై మోహన్ భగవత్ ఆందోళన వ్యక్తంచేశారు. అక్కడ పరిస్థితి సంక్లిష్టంగా, సవాలుగా మారిందని అభివర్ణించారు. ఈ పరిస్థితుల్లో కూడా ఆర్‌ఎస్‌ఎస్ వలంటీర్లు ఈశాన్య రాష్ట్రంలో బలంగా నిలిచారన్నారు. ప్రస్తుతం ఆ రాష్ట్రంలో భద్రతకు ఎటువంటి హామీ లేకుండా పోయిందన్నారు. స్థానికులే వారి భద్రత విషయంలో సందేహాలు వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఇక వ్యాపారాలు, సేవా కార్యక్రమాల నిమిత్తం అక్కడికి వెళ్లే వారి పరిస్థితి మరింత దారుణంగా ఉందన్నారు. అలాంటి పరిస్థితుల్లో కూడా సంఘ్ అక్కడే ఉండి... శాంతిని నెలకొల్పేందుకు ప్రయత్నిస్తోందని పేర్కొన్నారు. సాధారణ ఎన్‌జీవోలు చేయలేని పనిని సంఘ్ చేస్తోందని మోహన్ భగవత్ చెప్పారు. సంక్షోభ పరిష్కారానికి ఉన్న అన్ని అవకాశాలను తమ సంస్థ వినియోగించుకుంటుందన్నారు. అన్ని పక్షాలతో చర్చలు జరుపుతున్నట్లు వెల్లడించారు.

సేవలకు సెల్యూట్!

స్వచ్ఛంద సేవల్లో పాలుపంచుకోవాలన్న తపన ఉన్నా కొందరు సాహసించలేరు. ధైర్యం చేయలేరు. డబ్బు మాత్రం మంచినీళ్ల ప్రాయంలా ఖర్చు చేస్తుంటారు. బాధితులకు తమ సాయం అందిందని సంతృప్తి చెందుతారు. ధనం లేకపోయినా కొందరు ప్రతిఫలం ఆశించక సేవలందిస్తూ ఉంటారు. ఇందంతా ఒక ఎత్తయితే... వరద వణికిస్తున్నా సేవ చేయాలన్న మానవతా దృక్పథంతో కొందరు యువకులు, సముద్రం కెరటాల వలే ఎగసిపడే వరద అలలను తట్టుకుంటూ కొట్టుకుపోతున్న అశక్తులను రక్షించిన తీరు నిజమైన సేవకు అద్దం పడుతుంది. ఐదు రోజులు వరదకు ఎదురొడ్డి బాధితులను సురక్షితంగా ఒడ్డుకుచేర్చిన సేవాగుణ సంపన్నులను కీర్తించకుండా ఉండలేక పోతున్నారు బెజవాడ నగర ప్రజలు. పగలూ రాత్రీ తేడా తెలియకుండా బాధితులకు భగవత్ స్వరూపులుగా మారిన యువకులకు సెల్యూట్ చేస్తున్నారు వృద్ధులు.

విశాలాంధ్ర-డిజిటల్: సముద్రపు కెరటాల్లా ఎగసిపడుతున్న వరద ఉగ్రరూపాన్ని ఎదురొడ్డి బాధితులకు యువత అందించిన సేవలు అనన్య సామాన్యం. ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలన్న ఆతృతతో ఇళ్లు వదిలి వెళ్తున్న కొందరు... గంగమ్మ సుడిగుండంలో చిక్కుకుని కొట్టుకుపోతున్న ఎంతో మంది ప్రాణాలు కాపాడిన యువత ధైర్యసాహసాలు వర్ణించేందుకు తెలుగుపదాలు చాలవంటే అతిశయోక్తి కాదు. బలమైన స్తంభాలకు మోకులు కట్టి ... తానే మూల స్తంభంలా నిలిచి... అడుగడుగునా నిలబడి ఎటు వెళ్లకూడదో సూచనలిస్తూ వెన్నుదన్నుగా నిలిచిన యువకుల సేవలు స్ఫూర్తికిరీటం. మూర్తీభవించిన మానవత్వం, నిస్వార్థసేవాతత్పరతను కొందరు కొనియాడుతూ 'మీ తల్లిదండ్రులు చల్లగుండ' అని ఆశీర్వదించం హృదయాలను కదిలించివేసింది. కళేబరాలు కొట్టుకువస్తున్నా, కలుషిత నీటిలో పగలు... చీకటి భేదం మరిచి వరద ఉధృతికి వెరకవ తమ కుటుంబాలను జలవిలయంలో ఉన్నా... వారిని వదిలి మొక్కవోని ధైర్యంతో వరదబాధితుల ప్రాణాలను గట్టెంక్కించిన యువకుల సాహసాన్ని, తెగువను వర్ణించడం ఎవరితరమూ కాదు. వర్షంలో తడుస్తూ, నీళ్లల్లో నానుతూ నరకాన్ని తలపిస్తున్న కాళరాత్రిలోనూ గంటలకొద్దీ నిలబడి తమనూ తరిమికొట్టాలని చూస్తున్న వరద రక్కసితో జట్టుగా ఏర్పడిన యువత ఐదురోజులపాటు వీరోచితంగా పోరాడి అమాయకుల ప్రాణాలను రక్షించడం మాటల్లో చెప్పనలవికావు. కడుపు కాలుతున్నా, గొంతు తడారిపోతున్నా ప్రతిఫలం ఆశించని యువకులు రహదారిపై ఏర్పడిన అగాధాలను గుర్తించి బాధితులు మృత్యుకుహరం దరి చేరకుండా వలయంగా ఏర్పడి నడుం లోతు నీటిలో నక్కిన మృత్యు దేవత బారిన పడకుండా సురక్షిత ప్రాంతాలకు తరలిపోతున్న ఎన్నో కుటుంబాలకు ప్రాణంపోసిన తీరు రాబోయే తరాలకు జలపాఠంగా దోహదం చేస్తుందన్నది నగ్నసత్యం. నడవలేని ఎందరో వృద్ధులను భుజాలపైన, ట్యూబ్‌లు, ట్రైర్లనే బెడ్‌గా మలచి సురక్షిత ప్రాంతాలకు తరలించడం అద్భుతం. 'యువతా మేలుకో' అన్న నినాదం గట్టుపై ఉండి చేయడం చాలా తేలిక... అది చదువుకున్న వాళ్లకి ఆ నినాదం బోధపడుతుంది. కానీ కష్టజీవులైన యువకులు... పిలుపునకు అర్థం తెలియకున్నా చేసి చూపించారు. కాలు కిందపెడితే తడిచిపోతుందేమోనన్న జీతాలు తీసుకునే అధికారులు, పాలకులు... ప్రతిఫలం ఆశించకుండా ప్రాణాలు కాపాడిన యువతను భవిష్యత్‌లోనైనా ఆదర్శంగా దీసుకుంటే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని చాలామంది సీనియర్ సిటిజన్లు తమ అభిప్రాయాన్ని వెల్లడించారు.

వరద బాధితులకు సీపీఐ రూ.లక్ష విరాళం

విశాలాంధ్ర-విశాఖపట్నం: విజయవాడ వరద బాధితులకు తమవంతు సాయంగా సీపీఐ విశాఖ జిల్లా తరపున మొదటి విడతగా రూ.లక్ష సాయం అందించారు. ఈ మేరకు చెక్‌ను పార్టీ రాష్ట్ర కమిటీకి పంపారు. వరద బాధితుల సహాయార్థం స్థానిక పూర్ణా మార్కెట్ ప్రాంతంలో విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు మీడియాతో మాట్లాడుతూ... ప్రకృతి ప్రజలపై విలయ తాండవం చేసిందని, మానవతా దృక్పథంతో ప్రజలంతా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనేక ప్రాంతాలను వరద కకావికలం చేసిందని, జరిగిన నష్టం ఎవరూ పూడ్చలేనిదన్నారు. తమవంతు ఉడతాభక్తి సాయంగా విశాఖ జిల్లా తరుపున రూ.లక్ష రాష్ట్ర పార్టీకి పంపామని చెప్పారు. స్వచ్ఛంద సంస్థలు, ఉదారస్వభావులూ సహాయసహకారాలు అందించడం శుభపరిణామం అన్నారు. విపత్తుల్లో బాధితులను కలిసికట్టుగా ఆదుకోవాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం. మన్మథరావు, ఎస్‌కే రెహమాన్, అత్తిలి విమల, ఎండీ బేగం, బీ పుష్పలత, ఎం. శ్రీనివాసరావు పాల్గొన్నారు. కాగా, వరద బాధితులకు ఆర్థిక సాయం అందించిన సీపీఐ విశాఖ జిల్లా నాయకత్వానికి పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అభినందలు తెలిపారు.

ఆగస్టు కరెంటు బిల్లులు మాఫీ చేయాలి : సీపీఎం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వరద బాధిత ప్రాంతాల్లోని వినియోగదారులకు ఆగస్టు నెల విద్యుత్ బిల్లులు మాఫీ చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, ఇటీవల వచ్చిన వరదల నష్టం నుంచి తేరుకోకముందే వివిధ ప్రాంతాలలో విద్యుత్ శాఖ సిబ్బంది వినియోగదార్లకు కరెంటు బిల్లులు అందజేస్తున్నట్లు తెలుస్తోందని, తీవ్ర నష్టానికి గురైన కుటుంబాలు ఈ బిల్లులు చూసి ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. సీఎం ఆగస్టు విద్యుత్ బిల్లుల చెల్లింపు వాయిదా వేస్తామని ప్రకటించడం సమంజసంగా లేదన్నారు. వేలాది కుటుంబాలు తీవ్రంగా నష్టపోయిన పరిస్థితుల్లో ఆగస్టు కరెంటు బిల్లు చెల్లింపు వాయిదా కాకుండా, మాఫీ చేయాలని కోరారు.

వైసీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నెల వేతనం విరాళం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విజయవాడ నగర వరద బాధితుల కోసం వైసీపీ ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ఒక నెల వేతనాన్ని విరాళంగా ప్రకటించారు. పార్టీ చేపట్టనున్న వరద బాధిత సహాయ కార్యక్రమాలకు ఈ విరాళాన్ని వినియోగించనున్నారు. పార్టీ తరపున ఇంతకుముందు కోటి రూపాయల సహాయాన్ని వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్ ప్రకటించిన విషయం విదితమే. దాన్ని వినియోగించి వరద బాధితుల కోసం పాల ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లు పెద్ద ఎత్తున పంపిణీ చేశారు. ఇంకా బాధితుల అవసరాలు గుర్తించి, సరుకులు పంపిణీ చేస్తామని పార్టీ ప్రకటించింది. ఆ సహాయ కార్యక్రమాలకు తోడు ఇప్పుడు పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రటించిన విరాళం అదనం కానుంది.

ముంపు బాధిత రైతులకు రుణమాఫీ

కేంద్రానికి రైతు సంఘాల సమన్వయ సమితి విజ్ఞప్తి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: భారీ వర్షాలు, వరదలతో పంటలు కోల్పోయి తీవ్రంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను రైతు సంఘాల సమన్వయ సమితి కోరింది. విజయవాడలోని ఓ హోటల్‌లో శుక్రవారం కేంద్ర మంత్రిని సమన్వయ సమితి కన్వీనర్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, రైతు సంఘం నాయకులు వై.కేశవరావు నాయకత్వంలో నేతలు వినతిపత్రం అందజేశారు. ఇటీవలి భారీ వర్షాలు, వరదలతో కృష్ణాతీరం, బుడమేరు పరివాహక ప్రాంత పంట పొలాల ముంపునకు గురవడంతో పాటు రైతులు, ప్రజానీకం నిరాశ్రయులైనట్లు వివరించారు. భారీ వర్షాలతో కృష్ణానది, బుడమేరు ఉధృతి, గుంటూరు ఛానల్ ముంపు కారణంగా మానవ, జంతు ప్రాణాలకు అపార నష్టం కలిగిందని, ఆస్తులు, వ్యవసాయం, ఉద్యానవన, వాణిజ్య పంటలు, మత్స్య, పాడి పరిశ్రమలకు తీవ్ర నష్టం వాటిల్లిందని తెలిపారు. లక్షలాది ఎకరాల్లో పంటలు నీట మునిగి దెబ్బతిన్నాయని, చెరకు వంటి కొన్ని పంటలు రోజుల పాటు వరదల నీటిలోనే తేలియాడాయని చెప్పారు. ఉద్యానవన పంటలు సాగుదారులైన రైతులు ఎకరాకు రూ.2.50 లక్షల నుంచి రూ.2.75లక్షల వరకు నష్టపోయారని తెలిపారు. పసుపు, మిర్చి, పత్తి, అరటి తోటలు మొదలైన వాణిజ్య పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని... వరి రైతులకూ గణనీయమైన నష్టం వాటిల్లిందని, ఆపదలో ఉన్న రైతులకు తగిన సహాయం అందించేందుకు కేంద్రం తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. వరదల ఉధృతి కారణంగా పంటలతోపాటు పేద ప్రజల ఇళ్లు దెబ్బతిని వేలాది కుటుంబాలు నిరాశ్రయులయ్యారని చెప్పారు. ఇప్పటికే 30 మందికిపైగా మరణాలు సంభవించాయని, పశువులు, గొర్రెలు చనిపోయాయని, వేలాది మంది ప్రజలు వరద ముంపుతో నిరాశ్రయులయ్యారని తెలిపారు. నష్టపోయిన రైతులకు ఫసల్ బీమా పథకం, జాతీయ విపత్తు నిధి ద్వారా సాయమందించాలని కోరారు. పంటలు నష్టపోయిన రైతులకు పూర్తిగా ఖరీఫ్ పంట రుణాలను మాఫీ చేయడాని గాను ప్రభుత్వ, సహకార రంగ బ్యాంకులకు తగిన ఆదేశాలు ఇవ్వాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. వరదల దుష్ప్రభావాన్ని తగ్గించేందుకు, పూర్తి స్థాయిలో సహాయ, పునరావాస చర్యలు చేపట్టేందుకు, కాల్వలు, బుడమేరు, ఇతర కాల్వలు, డ్రెయిన్లు ఆధునీకరించడానికి కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక సహాయం అందించాలన్నారు. భవిష్యత్‌లో ఈ తరహా ప్రకృతి వైపరీత్యాలు పునరావృతమైతే దేశానికి, ప్రత్యేకించి వ్యవసాయ రంగానికి విపరీతమైన నష్టం కలిగించే ప్రమాదముందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఇలాంటి విపత్తులు కొనసాగకుండా, విపత్తుల నివారణకుగాను కేంద్ర ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని రైతు సంఘాల నేతలు కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు సింహాద్రి ఝాన్సీ, కృష్ణయ్య, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌కు పాస్‌పోర్టు కష్టాలు

ఐదేళ్లు కావాలని హైకోర్టులో పిటీషన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ముఖ్యమంత్రి పదవి పోవడంతో వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి పాస్‌పోర్టు కష్టాలు మొదలయ్యాయి. ఇప్పటికే పార్టీకి సిట్టింగులు, కీలక నేతలు గుడ్‌బై చెబుతున్నారని సతమతం అవుతున్న అధినేతకు తాజాగా మరో ఊహించని ఝలక్ తగిలింది. సీఎం పదవి పోవడంతో జగన్ డిప్లొమాట్ పాస్‌పోర్టును రద్దు చేస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. దీంతో చేసేదేమీ లేక జనరల్ పాస్‌పోర్ట్ కోసం ఆయన దరఖాస్తు చేసుకున్నారు. ఐదు సంవత్సరాలు జనరల్ పాస్‌పోర్ట్ ఇవ్వాలని హైదరాబాద్ సీబీఐ కోర్టు ఆదేశించింది. ఈ వ్యవహారంపై విజయవాడ ప్రజాప్రతినిధుల కోర్టులో మాజీ సీఎం పిటీషన్ దాఖలు చేశారు. దీనిపై విచారించిన కోర్టు... కేవలం ఒక సంవత్సరానికి పాస్‌పోర్ట్ ఇవ్వాలని ఆదేశించింది. అయితే తనకు ఐదు సంవత్సరాలకు పాస్ పోర్టు ఇవ్వాలని హైకోర్టులో జగన్ శుక్రవారం లంచ్ మోషన్ పిటీషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణను ఉన్నత న్యాయస్థానం సోమవారానికి వాయిదా వేసింది. దీంతో లండన్ ప్రయాణాన్ని వాయిదా వేసుకున్నారు. వాస్తవానికి జగన్ ఈనెల మూడో తేదీన సతీసమేతంగా లండన్ బయల్దేరి వెళ్లాలని అనుకున్నారు. ఇందుకు సీబీఐ ప్రత్యేక కోర్టు ఇటీవల అనుమతి కూడా ఇచ్చింది. కుమార్తె పుట్టినరోజు వేడుకల కోసం 25 దాకా అక్కడే ఉండాలని భావించారు. ఈ తరుణంలో విజయవాడ ప్రజాప్రతినిధుల కోర్టులో ఉన్న పెండింగ్ కేసుపై ఎన్‌వోసీ తీసుకోవాలంటూ ఇటీవల పాస్‌పోర్టు కార్యాలయం జగన్‌కు లేఖ రాసింది. ఎన్‌వోసీ కోసం ప్రజాప్రతినిధుల కోర్టులో జగన్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం షరతులు విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ షరతులపై జగన్ హైకోర్టును ఆశ్రయించారు. జగన్ లండన్ టూర్‌కు సీబీఐ కోర్టు ఇప్పటికే అనుమతి ఇచ్చిందని ఆయన తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. సీబీఐ కోర్టు అనుమతి ఇచ్చిన తర్వాత ప్రజాప్రతినిధుల కోర్టు షరతులు విధించిందని, ఇది సరికాదని వాదించారు. ఎన్‌వోసీ ఇచ్చేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ పిటిషన్‌పై తదుపరి విచారణను హైకోర్టు ఈనెల 9వ తేదీకి వాయిదా వేసింది.

హర్యానా అసెంబ్లీ ఎన్నికల వేళ

కాంగ్రెస్‌లో చేరిన వినేశ్, పునియా

న్యూఢిల్లీ: హర్యానా అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ భారత స్టార్ రెజ్లర్లు వినేశ్ ఫొగాట్, బజరంగ్ పునియా కాంగ్రెస్ పార్టీలో చేరారు. దిల్లీలో పార్టీ ప్రధాన కార్యాలయంలో సీనియర్ నేతల సమక్షంలో వీరిద్దరూ కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. దీనికి ముందు రెజ్లర్లు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసానికి వెళ్లి ఆయనను కలిశారు. మరోవైపు, పార్టీలో చేరడానికంటే ముందే భారత రైల్వేలో తమ ఉద్యోగాలకు వినేశ్, పునియా రాజీనామా చేశారు. హర్యానా అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ ఇటీవల సమావేశమైంది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులపై చర్చ జరిపింది. ఈ నేపథ్యంలోనే రెండు రోజుల క్రితం వినేశ్ ఫొగాట్, బజరంగ్ పునియా కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో భేటీ అయ్యారు. ఆ ఫొటోను కాంగ్రెస్ పార్టీ తమ 'ఎక్స్' ఖాతాలో షేర్ చేసింది. కాగా, కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థుల జాబితాను నేడో, రేపో విడుదల చేసే అవకాశాలున్నాయి. అందులో వినేశ్, పునియాకు టికెట్లు దక్కే సంకేతాలు కనిపిస్తున్నాయి.

కాంగ్రెస్ మా కన్నీళ్లు అర్థం చేసుకుంది: వినేశ్, పునియా

కాంగ్రెస్ పార్టీలో చేరిన అనంతరం వినేశ్ ఫొగాట్, బజరంగ్ పునియా మీడియాతో మాట్లాడారు. మహిళా రెజ్లర్లు లైంగిక వేధింపులకు గురైన అంశంలో తమ పోరాటానికి కాంగ్రెస్ అండగా నిలిచిందన్నారు. కాంగ్రెస్ తమ కన్నీళ్లు అర్థం చేసుకుందన్నారు. నిరసన సమయంలో తమను రోడ్డు మీద ఈడ్చుకెళ్లినప్పుడు బీజేపీ మినహా అన్ని పార్టీలు అండగా నిలిచాయని ఫొగాట్ చెప్పారు. తమ కన్నీళ్లను కాంగ్రెస్ అర్థం చేసుకుందని, తన పోరాటం ముగియలేదని, ప్రస్తుతం ఆ అంశం కోర్టుపరిధిలో ఉందని తెలిపారు. కచ్చితంగా న్యాయమే గెలుస్తుందని, ఇప్పుడు తనకు మరో వేదిక దొరికిందన్నారు. దేశసేవలో శక్తివంచన లేకుండా ముందుకు సాగుతానన్నారు. అధిక బరువు కారణంగా అనర్హత వేటు పడటంలో ఏదైనా రాజకీయ కుట్రకోణం ఉందా అని అడిగిన ప్రశ్నకు ఆమె సమాధానమిస్తూ 'అది నాకు ఎంతో ఉద్వేగపూరితమైన అంశం. దానిపై నేను సవివరంగా మాట్లాడతా. దానిపై నేను స్పందించేవరకు వేచి ఉండండి' అని అన్నారు. బజరంగ్ పునియా మాట్లాడుతూ 'ఈ దేశ కుమార్తెల కోసం మా గళం వినిపించినందుకు మూల్యం చెల్లించుకుంటున్నాం. రాజకీయాల కోసమే రాద్ధాంతం చేశామన్నారు. గతంలో బీజేపీ మహిళా ఎంపీలందరికీ లేఖలు రాశాం. మహిళల తరఫున గొంతు వినిపించాలని వేడుకున్నాం. కానీ, ఎవరూ ముందుకు రాలేదు. పార్టీ గీసిన గీత దాటలేదు. బీజేపీ మినహా అన్ని పార్టీలు మాకు అండగా నిలిచాయి. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి, దేశాభివృద్ధికి శక్తిమేర కృషి చేస్తాం. పారిస్ ఒలింపిక్స్‌లో ఫొగాట్ ఫైనల్‌కు చేరుకున్నప్పుడు దేశమంతా సంబరపడింది. కానీ, ఆ తర్వాత రోజు ఆమెను అనర్హురాలిగా ప్రకటించినప్పుడు అందరూ బాధతో కుంగిపోయారు. కానీ, ఒక ఐటీ సెల్ మాత్రం సంబరాలు చేసుకుంది' అని చెప్పారు.

రాహుల్‌ను కలిసినందుకు రైల్వే నోటీసులు

ప్రతిపక్ష నేత రాహుల్‌తో సమావేశమైనందుకు వినేశ్ ఫొగాట్‌కు రైల్వే షోకాజ్ నోటీసులిచ్చిందని కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్ శుక్రవారం విమర్శించారు. ఈనెల 4వ తేదీన వినేశ్, బజరంగ్ పునియా... రాహుల్‌గాంధీతో భేటీ అయ్యారు. రైల్వే అధికారుల నుండి వినేశ్‌కు షోకాజ్ నోటీసులు వచ్చాయని, ఆమె చేసిన నేరం రాహుల్ గాంధీతో సమావేశం కావడమేనని వేణుగోపాల్ అన్నారు. రాజకీయాలు చేయవద్దని రైల్వే బోర్డుకు హితవు పలికారు. రైల్వే నుండి వినేశ్ ఫొగాట్‌ను విడుదల చేసేందుకు అవసరమైన విధివిధానాలను వెంటనే పూర్తిచేయాలని రైల్వే అధికారులకు సూచించారు.

కోవిడ్ వేళ అక్రమాలు

కర్నాటకలో రూ.వెయ్యి కోట్ల దోపిడీ

బెంగుళూరు: కర్నాటకలో మరో భారీ కుంభకోణం వెలుగుచూసింది. కోవిడ్ మహమ్మారి సమయంలో భారీ అక్రమాలు జరిగినట్లు తేలింది. వందల కోట్లలో నిధులను దుర్వినియోగం చేసినట్లు ఆనాటి ప్రభుత్వంపై ఆరోపణలు వచ్చాయి. దీనిపై క్యాబినెట్‌లో చర్చించిన ముఖ్యమంత్రి సిద్దరామయ్య... బీజేపీ హయాంలో చోటుచేసుకున్న ఈ అక్రమాలపై చర్యలకు సిద్ధమవుతోంది. హైకోర్టు మాజీ న్యాయమూర్తి జాన్ మైఖేల్ కున్హా నేతృత్వంలోని కమిషన్ ఈ నివేదికను రూపొందించింది. ఆగస్టు 31న సుమారు 1722 పేజీలతో కూడిన నివేదికను సీఎం సిద్దరామయ్యకు అందజేశారు. కొన్ని కీలక పత్రాలు కనిపించకుండా పోయినట్లు ఆ కమిటీ గుర్తించింది. ఈ నేపథ్యంలో ఆ నివేదికను విశ్లేషించేందుకు రాష్ట్ర క్యాబినెట్ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. పూర్తి స్థాయిలో విచారణ నిర్వహించేందుకు కమిటీకి ఆరు నెలల అదనపు గడువు ఇచ్చారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలినీ రాజ్నీష్, అదనపు కార్యదర్శి ఎల్.కె.అతీక్ నేతృత్వంలోని అధికారుల బృందం జస్టిస్ కున్హా ఇచ్చిన నివేదికను అధ్యయనం చేయనున్నట్లు మంత్రి హెచ్‌కే పాటిల్ తెలిపారు. మరో నెల రోజుల్లోగా నివేదిక ఇచ్చేందుకు ఆ కమిటీకి సమయాన్ని కేటాయించారు. వందల కోట్ల రూపాయల నిధులను దుర్వినియోగం చేశారని, అనేక ముఖ్యమైన ఫైళ్లు కనిపించడం లేదని, ఎన్ని ఆదేశాలు ఇచ్చినా ఆ నివేదికలను కున్హా కమిషన్ ముందు ప్రవేశపెట్టలేదని, ఉన్నతాధికారులతో కూడిన కమిటీ అక్రమాలపై అధ్యయనం చేయనున్నట్లు సీఎం సిద్దరామయ్య తెలిపారు. సుమారు రూ.1,120 కోట్ల మేర నిధులను దుర్వినియోగం చేసినట్లు జస్టిస్ కున్హా తన నివేదికలో వెల్లడించినట్లు తెలుస్తోంది. కోవిడ్ సమయంలో మందులు. పరికరాల కొనుగోళ్లలో భారీ అక్రమాలు జరిగినట్లు పబ్లిక్ అకౌంట్స్ కమిటీ తన నివేదికలో పేర్కొంది. జస్టిస్ కున్హా కమిషన్‌ను ఆగస్టు 2023లో ఏర్పాటు చేశారు. కోవిడ్ అక్రమాలు జరిగిన సమయంలో కర్నాటకలో బీజేపీ అధికారంలో ఉన్నట్లు తాజా ప్రభుత్వం ఆరోపించింది. కాగా, ఇప్పటికే సీఎం సిద్దరామయ్య ప్రభుత్వాన్ని ముడా కుంభకోణం ఇబ్బందిపెడుతోంది. ఆయన భార్య పార్వతమ్మ పేరిట మైసూరు ప్రాంతంలో ఉన్న భూములను గతంలో అభివృద్ధి పనుల కోసం ముడా సేకరించింది. పరిహారంగా ఆమెకు మైసూరు- విజయనగరలో స్థలాలు కేటాయించింది. సీఎం మౌఖిక ఆదేశాలతో మైసూరు నగరాభివృద్ధి సంస్థ (ముడా) అధికారులు ఆమెకు ఖరీదైన ప్రాంతంలో విలువైన స్థలాలు కట్టబెట్టారని బీజేపీ ఆరోపించింది. ఈ తరుణంలో బీజేపీ నేత, మాజీ ముఖ్యమంత్రి యడియూరప్ప హయాంలో చోటుచేసుకున్న అవకతవకలపై తాజా నివేదిక వెలువడింది.

నిత్యావసరాల సరఫరాకు ఎండీయూ వాహనాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వరద ప్రభావిత ప్రాంతాల్లో నిత్యావసర సరుకులు ఇంటింటికీ పంపిణీ చేసే ఎండీయూ వాహనాలను అందుబాటులో ఉంచారు. విజయవాడ బీఆర్టీఎస్ రోడ్డు పొడవునా ఇవి బారులు తీరాయి. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల వాహనాలతోపాటు ఉభయ గోదావరి, ప్రకాశం జిల్లాల నుంచి పెద్దఎత్తున ఎండీయూ వాహనాలు రావడంతో బీఆర్టీఎస్ రోడ్డు రద్దీగా మారింది. బియ్యం, నిత్యవసరాల సరుకుల పంపిణీ కోసం ప్రభుత్వం 1,200 వాహనాలను ప్రభుత్వం హుటాహుటీన ఏర్పాటు చేసింది. అందులో అత్యధికంగా గత ప్రభుత్వ హయాంలో ఇంటింటా రేషన్ పంపిణీ చేసిన వాహనాలే ఉన్నాయి. ఆయా వాహనాలపై గత ముఖ్యమంత్రి బొమ్మ కనిపించకుండా అడ్డుగా బ్యానర్లు బిగించారు. వాటిపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఫొటోలు ఉంచారు. బాధితులకు ఆహారం, నిత్యావసర సరుకుల పంపిణీకి సిద్ధం చేశారు. వీటికి తోడుగా ప్రైవేట్ లారీలను అందుబాటులో ఉంచారు. అందులో నిత్యావసరాలు అందుబాటులో ఉంచి, వాటిని వివిధ ప్రాంతాలకు పంపిణీ చేయనున్నారు. కృష్ణాతీరం, బుడమేరు పరివాహక ప్రాంతాల్లో వరద ముంపునకు గురైన బాధితులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్నారు. రేషన్‌కార్డులు లేని వారికి ఆధార్ ఆధారంగా సరుకులులిచ్చారు. ఇందుకోసం పౌరసరఫరాలశాఖ, పోలీసు, రెవెన్యూశాఖలు సన్నద్ధమయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటా రేషన్‌ను పంపిణీ చేసేవారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆర్థిక భారమనే ఆలోచనతో వాటిని పక్కన పెట్టింది. వాటిని రద్దు చేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం పెద్దఎత్తున వరద బాధితులకు ఆహార సరఫరా చేయాల్సి ఉన్నందున ఎండీయూ వాహనాలను అధికారులు అందుబాటులోకి తెచ్చారు. ఇప్పటికే అవసరమైనచోట వరద బాధితులకు వలంటీర్లు సేవలందిస్తున్నారు. అటు మంచినీటి సౌకర్యం కోసమూ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అలంకార్ థియేటర్ సమీపంలోని మున్సిపల్ వాటర్ ట్యాంకర్ దగ్గరకు వాహనాలు చేరుకుంటున్నాయి. వాటర్ ట్యాంకర్లతో మంచినీటిని నింపి వివిధ ప్రాంతాలకు పంపుతున్నారు. విజయవాడ నగరంతోపాటు గుంటూరు, బాపట్ల, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాలకు ట్యాంకర్లను తరలిస్తున్నారు.

శాస్త్రమే పురోగతికి మార్గం: స్టాలిన్



చెన్నై: పురోగమనానికి శాస్త్రమే ప్రధాన మార్గమని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అన్నారు. ఇటీవల చెన్నై అశోక్ నగర్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మహావిష్ణు పరంపోరుల్ ఫౌండేషన్ (ఎన్‌జీవో) అధ్వర్యంలో జరిగిన ఆధ్యాత్మిక సదస్సు వివాదాస్పదంగా మారింది. ఈ సదస్సుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఇలాంటి సదస్సు జరపవచ్చా అని డీఎంకే మద్దతుదారులు రాష్ట్ర ప్రభుత్వాన్ని, విద్యాశాఖను ప్రశ్నించారు. వామపక్ష యువజన, విద్యార్థి సంఘాల నేతలు కూడా పాఠశాలలో ఆధ్యాత్మిక సమావేశాలు జరపడంపై రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీస్తూ నిరసన తెలిపారు. ఈ నేపథ్యంలో తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ దీనిపై తీవ్రంగా స్పందించారు. 'మేము అందిస్తున్న పాఠ్యపుస్తకాల్లో విద్యార్థులు తెలుసుకోవలసిన అత్యుత్తమ శాస్త్రీయ ఆలోచనలు ఉన్నాయి. భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొనేందుకు, జ్ఞానానికి పదును పెట్టేందుకు అవసరమైన అత్యుత్తమైన ఆలోచనలను ఉపాధ్యాయులే బయటకు తీసుకురాగలరు. అందుకు వారికి అవసరమైన వినూత్న శిక్షణ, సామాజిక విద్యను సంబంధిత శాఖ నిపుణులు, పండితులతో అందించేందుకు పాఠశాల విద్యాశాఖ చర్యలు తీసుకుంటుంది. వ్యక్తిగత పురోగతి, నైతిక జీవనం, సామాజిక అభివృద్ధికి మంచి ఆలోచనలు విద్యార్థుల హృదయాలలో నాటాలి. గత మూడు సంవత్సరాలుగా నేను విద్య ప్రాముఖ్యతను, శాస్త్రీయ ఆలోచనను పెంపొందించాల్సిన అవసరాన్ని అనేక కార్యక్రమాలలో నొక్కి చెప్పాను. శాస్త్రమే పురోగతికి మార్గం' అని స్టాలిన్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. శుక్రవారం ఆ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేశ్ 'ఎడ్యుకేషన్ ద బెస్ట్ వెపన్ టు స్ప్రెడ్ ఈక్వాలిటీ' అనే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలి. విద్యార్థులు ఏది తప్పో, ఏది ఒప్పో ఆలోచించాలి. ప్రతి విషయాన్ని తార్కికంగా విశ్లేషించాలి. అందరూ సమానమే. చదువు ఒక్కటే దోచుకోలేని ఆస్తి' అని అన్నారు. పాఠశాలలో ఆధ్యాత్మిక సమావేశాలు జరిపిన బాధ్యులపై కఠినంగా చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. ఇలాంటి సంఘటనలు రాష్ట్రంలో ఇకపై జరగవని ఆయన తెలిపారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.